జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 1 సంచిక : 9,10

శ్రీః


# కామకోటి వాణి

శ్రీ శోభకృత్ జ్యేష్ఠ - ఆషాఢ మాసం - మే-జూన్ 2023



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము

# శ్రీ కామకోటి తౌర్యత్రిక సభను ఉద్దేశించి స్వామివారి అనుగ్రహ భాషణం



గురుర్ బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః ॥
శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయమ్ ।
నమామి భగవత్పాద శంకరం లోకశంకరం ॥
శ్రుతి స్మృతి పురాణోక్త ధర్మమార్గ రతం గురుం ।
భక్తానాం హితవక్తారం నమస్యే  చిత్తశుద్ధయే ॥
అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం ।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదాన్వహం ॥
సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।
అస్మదాచార్య పర్యన్తాం వందే గురు పరంపరాం ॥

ఈ ప్రపంచ పటంలో భారతదేశం గొప్పతనం మీరందరూ తెలుసుకొన్న విషయమే. భారతదేశం సనాతనధర్మ భూమి, పవిత్ర భూమి. ప్రాచీనమైన సంస్కృతిని లోకానికి అందించిన భూమి. 'సత్యం వద ధర్మం చర' అని లోకానికి సందేశాన్ని ఇచ్చిన భూమి.

**'శతయోజన విస్తీర్ణం పుప్లువే లవణార్ణవం'.**


***'ఉల్లంఘ్య సింధోః సలిలం సలీలం ।***

***యశ్శోక వహ్నిం జనకాత్మజాయాః' ॥***

అని జనకాత్మజ అయిన సీతాదేవి తాపాన్ని తొలగించడానికి ఆంజనేయస్వామి సముద్రలంఘనం చేశారు. ఆ సందర్భంగా ఆయన 'సూర్యాయ ఇంద్రాయ వాయవే' అని తండ్రికి నమస్కారం చేయాలనే సంస్కృతిని నేర్పారు. భారతీయ సనాతన సంస్కృతిలో మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్యదేవోభవ! అతిథిదేవోభవ! అంటారు. తల్లిదండ్రుల్ని దేవతలుగా భావించి నమస్కరించాలి, విశ్వసించాలి, ఆదరించాలి, గౌరవించాలి అనే విషయాన్ని మన ఉపనిషత్తులు మనకు నేర్పుతున్నాయి. విశ్వమానవ సంస్కృతి, ఇప్పుడు మా 'నవ' సంస్కృతి అయిపోయింది. అందుకే ఇప్పుడు తిరిగి మానవ సంస్కృతిని తీసుకు



రావాలంటే వేద సంస్కృతి, సనాతన సంస్కృతిని మనం పునరుద్ధరించాలి. పునః దేదీప్యమానంగా ప్రచారం జరగాలి. వేదమార్గాన్ని, శాస్త్రమార్గాన్ని ప్రచారం చేయడం రామాయణం నుంచి ప్రారంభం చేయాలి. 'వేదః ప్రాచేదసాత్ ఆసీత్ సాక్షాద్రామాయణాత్మనా' అని రామాయణంలోని ఒక్కొక్క కాండ ప్రాశస్త్యం గురించి చాలామంది సౌందర్యంగా, లలితంగా చెప్పారు. సముద్రమథనం చేస్తున్నప్పుడు అమృతంతో పాటు అవసరం ఉన్న విషయాలు కొన్ని, అవసరం లేని విషయాలు కూడా వచ్చాయి. మహాలక్ష్మి అమ్మవారు, గుఱ్ఱం, కౌస్తుభము, ఐరావతం వంటి వాటితో పాటు అమృతం, మధ్యలో హాలాహలం (కాలకూట విషం) వచ్చింది. కానీ రామాయణం మథనం చేస్తున్నప్పుడు అమృతం మాత్రమే వస్తుంది. ఇప్పుడు లోకంలో మానవ స్వార్థం, అత్యాశ, అసూయ, ద్వేషం ఇత్యాది కారణాల వల్ల అశాంతి ఉంటోంది. ప్రస్తుతలోకంలో కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ కర్మలు వ్యాపారాధీనం అంటే కామర్సు ట్రేడుకు ఆధీనంగా అయిపోయింది. ఎక్కడ లాభం వస్తుంది అని చూడడమే ధ్యేయం. అలా అయోమయమైన ఈ సందర్భంలో ధర్మప్రచారం మన దేశానికి, ప్రపంచంలోని అన్ని దేశాలకి కూడా అవసరమైంది. ఇది వరకు మనం సంకల్పంలో భరతదేశే, భరతఖండే, మేరోః దక్షిణ పార్శ్వే, కృష్ణా గోదావర్యోః మధ్యప్రదేశే, శ్రీశైలస్య ఆగ్నేయ దిగ్భాగే అని చెప్పేవాళ్ళం. ఇప్పుడు అంటార్కిటికా, ఆఫ్రికా ఆని కలిపి సంకల్పంలో చెప్పాల్సివస్తోంది. ధర్మప్రచారం అనేది భూఖండానికి అవసరమైన అయిన విషయం. ఐశ్వర్యం ఉన్నవాళ్ళు భద్రత లేదనుకుంటారు. సౌకర్యాలు ఉన్నవాళ్ళు కూడా ఇంకా మనకు అది కావాలి. ఇది కావాలి అని ఆలోచిస్తారు. అమ్మవారి గురించి చెప్తూ 'నిస్సీమ మహిమా' అంటారు. వీళ్ళు అలా 'నిస్సీమ మహిమా'గా ఉండాలనుకుంటారు. పరిధి లేని, పరిమితి లేని ఐశ్వర్యం కావాలని కోరిక. భయం చేత, స్వార్థం వల్ల ఇక్కడ ఆశ పెరిగింది. (ఒకప్పుడు అనుమానం అనేది ఒక ప్రమాణం అని భారతదేశం చెప్పింది. ప్రత్యక్షము, అనుమానం, ఉపమానం, శబ్దం ప్రమాణమని చెప్పింది.) ఇప్పుడు లోకంలో చూస్తే ఎక్కడ చూసినా అనుమానాలు. ఈ దేశం ఇంకో దేశాన్ని ఏమి చేస్తుందో, ఎప్పుడు ఎవరు ఏం చేస్తారో అని ఒకరికొకరు నమ్ముకోని, నమ్మకం లేని పరిస్థితిలో ఉన్నాము. లోక వ్యవహారం ఇప్పుడు ఒకరిని చూసి ఒకరు బయటకు నవ్వుకుంటున్నారు.(పలకరింపు). మూడు నాలుగు గంటలు మాట్లాడుకుంటున్నారు. పరస్పరం మామిడిపళ్ళు పంపించుకుంటున్నారు. ఒక రాజ్యం నుండి వేరే రాజ్యానికి మామిడిపండ్లు వస్తాయి కాని ఇంకొక వైపు అనుమానాలు ఉంటూ



ఉంటాయి. అలా ఉన్న అనుమానాలు తీర్చడానికి హనుమంతుని శక్తి, సామర్థ్యం అవసరం. 'బుద్ధిర్బలం యశో ధైర్యం నిర్భయత్వం అరోగతా అజాడ్యం వాక్పటుత్వంచ. నవ వ్యాకరణవేత్త అని ఆయన గురించి చెబుతారు. 'నానృగ్వేద వినీతస్య నాయజుర్వేద ధారిణః నాసామవేద విదుష: శక్యమేవం ప్రభాషితుమ్' అని అంత గొప్పగా ఆంజనేయస్వామి గురించి చెప్తారు కదా !

అలాంటి సామర్థ్యం భారతదేశానికి ఈ రోజు అవసరం అయింది. భారతదేశం శక్తి సామర్థ్యంతో ఉంటేనే కాపాడుకోవటానికి సాధ్యమవుతుంది. తరువాత ఇతర దేశాలకి సహకరించవచ్చు. అక్కడ నుండి ఏదైనా ఆపదలు వచ్చే స్థితి ఉన్నా దాని నుండి కాపాడుకోవచ్చు. మొత్తానికి ఆంజనేయస్వామి యొక్క విలువలు ఇప్పుడు భారతదేశానికి అవసరం. ఆయన లక్షణాలు ఏవైతే చెప్పారో బుద్ధిః, బలం, యశః, ధైర్యం, నిర్భయత్వం, అరోగతా ముఖ్యంగా అవసరం. గత రెండు సంవత్సరాలుగా మనం ఈతి బాధల్ని చూస్తున్నప్పుడు 130కోట్ల జనాలందర్ని కాపాడడానికి శక్తి సామర్థ్యం మనకు కలగాలి, ఆరోగ్యం కలగాలి అని ప్రార్థించాము. ఆరోగ్యం కలగడానికి హెల్దీ డిస్కషన్స్ ఉండాలి. హెల్దీ డిబేట్ అంటారు వాళ్ళు. ఏదైనా అసూయ, ద్వేష రహితంగా ఉండాలి. వివేకచూడామణిలో 'సర్వ వేదాంత సిద్ధాంతం గోచరం తం అగోచరం గోవిందం పరమానందం సద్గురుం ప్రణతోస్మ్యహం' అని శంకరాచార్యులు గురువందనం చేస్తారు. అలా చేయడాన్ని సాధనా చతుష్టయ సంపత్తి అంటారు. శమ, దమ తితీక్ష ఇత్యాది ఆత్మగుణ సంపత్తి ఉండాలి. సంపత్తి అనేది రూపాయలా, యూరోలా, డాలర్లా లేకపోతే మన ప్రక్క దేశం వాళ్ళు ఆలోచిస్తున్న క్రొత్త ద్రవ్య విధానమా అనేది ఆలోచించాలి.

మన దేశంలో ముఖ్యంగా అసలైన సంపద గుణసంపద. గుణ ప్రధానమైన జీవితం గురించి 'న కేవలం గచ్ఛతి తస్యకాలే యయుః శరీరావయవః వివృద్ధిం వంశ్యాః గుణాః ఖల్వపి లోకకాంతాః ప్రారంభసూక్ష్మాః ప్రతీమానం ఆపుః' అని సూర్యవంశరాజు గురించి కాళిదాసు మహాకవి చెప్పారు. ఆరు సంవత్సరాల వయస్సులో రాజ్య పదవికి వచ్చారు. పరిస్థితుల వల్ల చిన్న వయస్సులో బాధ్యత వచ్చిందాయనకి. ఆ రాజు పేరు సుదర్శనుడు. ఆయన గురించి వర్ణిస్తూ ఆరు సంవత్సరాల చిన్న బాలకుణ్ణి మహారాజా అనే శబ్దంతో పిలవచ్చా అని అడిగితే పిలవవచ్చనే అన్నారు. ఆ చిన్నవయస్సులో ఉండే అబ్బాయినైనా 'మహారాజు' అని వ్యవహరించవచ్చు. కారణమేమిటంటే వజ్ర వైఢూర్యం పెద్ద రాయిలా ఉండదు కదా ! సన్నగా చిన్నగా ఉంటుంది. చెవికి అలంకారంగా చేసుకుంటారు.






దానికి మహానీలం అని పేరు. మహానీలం చిన్నదే కాని 'మహానీలం' అని మహత్త్వమైన శబ్దం వేసిన విశేషణం ఉంటుంది. అంటే గొప్పతనం వల్ల మహత్త్వ శబ్దం వస్తుంది. అలా 6 సంవత్సరాల అబ్బాయిని అయినా తెలిలితేటలతో, పరిపక్వతతో ఉంటే మహారాజు అనొచ్చు. (ఈ సమయంలో మనకి 60, 70 వయస్సు వాళ్ళైనప్పటికీ కూడా వారిలో పరిపక్వత కనిపించడం అరుదైంది.) ఆయన అప్పుడే అక్షరం దిద్దుకున్నారు. (ఆ కాలంలో మూడున్నర వయస్సులో స్కూలులో చేర్పించే అలవాటు లేదు. అడ్మిషన్స్ కోసం రిజర్వేషన్ చేసుకునే పరిస్థితి లేదు.) కాని అప్పుడు ఓం నమః శివాయ సిద్ధం నమః , డు,ము,వు,లు ప్రథమావిభక్తి నేర్చుకునే సమయంలోనే ఆయన రాజనీతి శాస్త్రమంతా పూర్తిగా నేర్చుకున్నారు. 'శృత వృద్ధ యోగాత్' ఎక్కువగా విన్నారు. ఎవరైతే చదువుకున్నవాళ్ళు, అనుభవజ్ఞానం ఉన్నవాళ్ళున్నారో, ఆ పెద్దవాళ్ళ దగ్గర విని ఆయనకి అనుభవం, ఆసక్తి, అభిజ్ఞానం, అభిజ్ఞ ఇలాంటివన్నీ వచ్చాయి. అందుకని ఆయన మంచిగా నిర్వహణ చేశారని ఆయన గురించి చెప్తారు. సింహాసనంలో కూర్చొని ఉంటే క్రింద ఉన్న బంగారు పాదుకలు అందడం లేదు. పీఠం ఉన్నది కాని దాన్ని కూడా తాకడం కుదరలేదు. అంటే కాలు యింకా పెద్దది అవ్వలేదు. అంతటి చిన్న పిల్లవాడు.

అందుకని చిన్న వయస్సు నుంచే ధర్మాన్ని, విద్యని నేర్పడం అనేది మన దేశంలో ఒక సంస్కృతి. అక్షరజ్ఞానం, చదువుతోపాటు భక్తి, సంస్కృతి అలవాటు చేయడం అవసరం. ఇప్పుడు కాంక్ష తక్కువగా ఆకాంక్ష ఎక్కువగా ఉంటోంది. గురుకుల పద్ధతిని అనుసరించి మన దేశంలో సంస్కృతి, నాగరిగతని ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. టెక్నాలజి, వాహనాలు వచ్చాయి. ఇంటర్నెట్ సౌకర్యాలను అంతర్జాలం అంటారు. ఇది మాయాజాలంగా కూడా ఉంటుంది. (అంటే చేపల వాళ్ళు సముద్రానికి వెళ్ళినప్పుడు ఏ జాలం వేస్తారో అలా వల లాగా ఉంటుంది.) మన సంస్కృతి యొక్క గొప్పతనాన్ని తెలుసుకోవడానికి మనకు ఆయుష్షు చాలదు. అందుకని సత్సంగం అనేది అవసరం. అక్కడక్కడ సత్సంగ ఏర్పాట్లు చేయాలి. మన దేశం యొక్క విద్యావిధానంలో వైజ్ఞానిక విషయాలున్నాయి. పర్యావరణ విషయం ఉంది. పరివార సంస్కృతి ఉన్నది. పరిసరాల పరిరక్షణ ఉన్నది. ఈ రోజు మేనేజ్‌మెంట్‌లో విజ్ఞానంలో ఏదైతే క్రొత్తగా చెబుతున్నారో, గ్లోబల్ వార్మింగ్, గ్లోబల్ ఎనర్జీ ,పొల్యూషన్ కంట్రోల్, CSR (Corporate Social Responsibility) విషయాలన్నీ కూడా ధర్మంలో ధర్మశాస్త్రంలో నిహితంగా ఉన్నాయి. అందుకని మన సంస్కృతిలో లేని విషయాలు లేవు. మానవజాతికి అవసరమైన మార్గదర్శకమైన విషయాలన్నీ కూడా మన సనాతన హిందూ సంస్కృతిలో ఉన్నాయి. విజ్ఞానం కొంత వరకు విదేశం నుంచీ మనం నేర్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఎందుకంటే ఇక్కడ మనం ఆ ప్రయత్నాలు తీవ్రంగా చేయడం లేదు. మన దగ్గర డబ్బు లేదని అలాంటి నిర్ణయాలు తీసుకోలేమా లేక అందరూ కలిసి పనిచేసే తత్త్వం లేదా? అనేది విషయం కాదు. మొత్తానికి వాస్తవంగా మనం చూస్తున్నప్పుడు విజ్ఞాన రంగంలో కొన్ని విషయాలు విదేశాల నుండి నేర్చుకోవాల్సిన స్థితి ఉంది. వాళ్ళు లాబ్ డెవలప్ చేస్తారు. వాళ్ళ విద్యావిధానంలో కూడా కొన్ని ప్రోత్సాహకాలు, స్కాలర్‌షిప్స్ ఉన్నాయి. చదువు కోసం వాళ్ళు చదువుతారు. మన దేశంలో ఉద్యోగం కోసం చదివే విషయం ఉంది. భారతదేశంలో ఇంతకు ముందు ఇలా లేదు. ఇప్పుడు భౌతిక ప్రపంచంలో మనకు కూడా ఆసక్తి పెరిగింది. భౌతిక అవసరాలు పెరిగాయి. అలాంటి పరిస్థితి ఉంది కనుక కొంచెం లోపం ఉంది. కాని సంస్కృతి, సివిలైజేషన్ విషయంలో మనం విదేశం నుంచి ధర్మాన్ని నేర్చుకోవాల్సిన అవసరం అస్సలు లేదు. అందుకని మనలో ధైర్యం, నమ్మకం పెరగాలి. ఈ సత్సంగాన్ని మనం ఇంకా ఎక్కువ ప్రచారం చేస్తూ ఉండాలి. మన ధర్మంలో, వేదంలో, ఉపనిషత్తులలో,

నీతిశాస్త్రంలో, చాలా విషయాలున్నాయి. సుభాషిత తత్త్వ భాండాగారాలు ఉన్నాయి. ఉపాసనా పద్ధతి ఉన్నది. సంగీతశాస్త్రం, భరతనాట్యం, యోగశాస్త్రం, మంత్రశాస్త్రం ఉన్నాయి. ఇలా సంస్కృతి పరంగా ఇతరులకు అందించే, అందరికీ పంచే శక్తి మనలో ఉన్నది. కాని దీనిని మనం తెలుసుకోవాలి కదా ! జాంబవంతుడు ఆంజనేయ స్వామికి చెప్తే అపుడు ఆయన తన శక్తిని తెలుసుకున్నారు. తరువాత సముద్రలంఘనం చేశారు. అందుకని మంచి ప్రయత్నాలు చేస్తూ ఉండాలి.

ఆంధ్రదేశంలో వేదశాస్త్రాలు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. ఘనపాఠీలు, వేదపండితులు, అగ్నిహోత్రులు ఉన్నారు. ప్రాచుర్యంతో పాటు ప్రహరీ (పాకారం) అవసరం. (శ్రీరంగం అనేది సప్త ప్రాకారం. గర్భగుడిలో రంగనాథస్వామి ఉంటారు. బంగారు గోపురం ఉంటుంది. దాని తరువాత సప్తప్రాకారాలు ఉంటాయి. అలా ప్రాకారం అవసరం.) ఆంధ్రదేశంలో గర్భగుడి బాగా ఉంది. చిన్నవయస్సు వాళ్ళు స్నానం, సంధ్య, అగ్ని ఉపాసనా, తక్లీలో క్రొత్త యజ్ఞోపవీతం వడకటం, స్వయంపాకం చేసుకోవడం, ఇంకా భోజనాత్పూర్వం మడిగా కూర్చుని, భోజనం చేయటం, ఆచారాలు అన్నీ బాగానే ఉన్నాయి. గర్భగుడితో పాటు అర్ధమండపం, మహామండపం, బలిపీఠం, ధ్వజస్తంభం, గాలిగోపురం, మాడవీధి, రాజవీధి ఇవన్నీ కూడా మనం మంచిగా తయారు చేయాలి. దానికి పురాణాలు, సాహిత్యం, సంగీతం, సంగీతవాయిద్యాలు, అనే చతుష్షష్టి కళల (చతుష్షష్టి కళాభిజ్ఞాయై నమః అమ్మవారిని అంటాము.) ద్వారా ఇవన్నీ చేస్తే మనం కోరుకునే కలలు సఫలం అవుతాయి. ఇప్పుడు ప్రయాగ రామకృష్ణ, ప్రయాగ శ్రీనివాసు రెండు ప్రయాగలు కలిశాయి. ప్రయాగ అంటేనే కలవటం. ప్రయాగ అనేది ప్రకృష్ట యాగం. బ్రహ్మ దేవుడు ప్రయాగకు వెళ్ళి వంద క్రతులువు చేయాలి అనుకున్నారట. యజ్ఞం, యాగం మొదలుపెట్టారు. ఆ సమయంలో అశరీర వాక్కు వచ్చింది. మీరు ఏదైతే మొదలుపెట్టారో ఆ యజ్ఞయాగాలు 100 చేయడమనేది చాలా కష్టం. మీరు కంచికి వెళ్ళండి. దానికి సత్యవ్రత క్షేత్రమని పేరు. బ్రహ్మదేవుడైన మీరు కంచిలో కనుక యజ్ఞం చేస్తే ఒక్క యజ్ఞం చేసినా వంద యజ్ఞాలు చేసిన ఫలితాలు వస్తాయి. శివ, కేశవులకు మనం పూజలు చేస్తున్నాము. బ్రహ్మదేవుడికి కూడా మంచిగా చేయాలి. ఆ బ్రహ్మదేవుడు కంచికి వచ్చి యజ్ఞయాగాలు చేసారు. ఆ యజ్ఞంలో యజ్ఞ కుండం నుండి ప్రకటితమైన వారే శ్రీవరదరాజస్వామి. 'వప పరిమళోల్లాసి వాసితాధర పల్లవం ముఖం వరదరాజస్య మందస్మిత ముపాస్మహే' అని యజ్ఞకుండం నుండి వప హవిర్భాగాన్ని తీసుకొని ప్రజలను అనుగ్రహించే స్వామి ఆ వరదరాజస్వామి. బ్రహ్మదేవుడు ద్వారా బ్రహ్మోత్సవాలు మనం జరిపిస్తున్నాము. బ్రహ్మోత్సవం చేస్తున్నప్పుడు వేదపారాయణాలు ఉంటాయి. దానితో పాటు కోలాటం, సంగీతకచ్చేరి, సన్నాయి, నాదస్వరం, అన్నీ ఉంటాయి. ఇవన్నీ కూడా అవసరం. ఎలా మంత్ర జపాలు, వేద స్వస్తి, అవసరమో అలా సంగీతం, కళ కూడా అవసరం. దాని ద్వారా మనకి మనస్సులో శాంతి కలుగుతుంది. "రమణీయం ప్రసన్నాంబు సన్ మనుష్య మనో యథా" అన్న సూక్తి చెప్తారు కదా ! ప్రసన్నమైన మనసుకు లలితమైన సంగీతం అవసరం. 95 ఏళ్ళ వయస్సులో పల్లకీలో మహాస్వామివారు విశ్రాంతి తీసుకునే సమయంలో కూడా 'శివః శక్త్యా యుక్తో యది.." వంటి సౌందర్యలహరి శ్లోకాలు కాని అమ్మవారి శ్లోకాలు కాని పారాయణ చేసేవారు. సాహిత్యం, సంగీతం, ఉపాసన, జ్ఞానాలలో ఆయన అభిరుచి అపారం. సంగీతం అనేది నాదోపాసనం.



*పరా ప్రత్యక్చితీరూపా పశ్యంతీ పరదేవతా ।*
*మధ్యమా వైఖరీరూపా భక్తమానస హంసికా ॥*

అనే లలితా సహస్రనామంలో మనం వింటున్నాం. అలా పరా,



పశ్యంతీ, మధ్యమా, వైఖరీ దీని గురించి కుమారసంభవంలో కాళిదాసు కవి చెబుతున్నారు. సంగీత శాస్త్రంతో నాద, తను, మనిషం అని త్యాగరాజస్వామి చెప్పటం మనం విన్నాము. అలా నాద ఉపాసన అనేది ప్రజలకు మనశ్శాంతిని, మనస్సులో సంతోషాన్ని కలిగిస్తుంది. నాడీశుద్ధి, – ఇడ, పింగళ నాడీ శుద్ధిని కలిగిస్తుంది. అందుకని ఇది ఒక యోగ శాస్త్రం. ఉపాసన, వైజ్ఞానికం, గణికం, సాహిత్యం. సంగీతంశాస్త్రం ఆంధ్రదేశంలో, తమిళనాడులో చాలా వరకు ప్రచారంలో ఉన్నాయి. వేదశాస్త్రములూ ప్రచారంలో ఉన్నాయి. కాని ఇంకా సంఖ్య పెరగాలి. సంగీతం, నాట్యం, వాద్యం మొదలైనవాటి మీద ఆదరణ, అభిమానం, ఆప్యాయత పెరగాలి. ఆంధ్రదేశంలో సాహిత్య, సంగీత, నృత్య, అవధానం ప్రచారం చేయాలనే దృష్టితో ఒక సభ మొదలు పెట్టాలని సంకల్పించాము. ప్రయాగ రామకృష్ణ, ప్రయాగ శ్రీనివాస్, మాగంటి సుబ్రహ్మణ్యం, వారి స్నేహితులు, భక్తబృందం అందరూ కలిసారు.

డిసెంబర్ సీజన్‌లో చెన్నైలో ఎలా సంగీత కార్యక్రమాలు జరుగుతున్నాయో అలా ఆంధ్రదేశంలో కూడా చేయాలని విశాఖపట్టణం, విజయవాడలలో చెయ్యాలని మేము వీరికి చెప్పాము. అలా చెప్తున్నప్పుడు ఒక సంస్థ మొదలు పెడదామని, శ్రీ కామకోటి తౌర్యత్రిక సభ అని పేరును స్థిరపరిచాము. నామకరణము ఇప్పుడు అనేక రకములుగా ఉంది. (ఇపుడు నామకరణం అనేది వివిధభారతి అనే రేడియో ప్రోగ్రాం లాగా రకరకాలుగా ఉంటుంది. వివిధ భారతి మంచిగా ఉంటుందనుకోండి. దీనిలో క్రొత్తగా తెలుగు, తమిళ, సంస్కృత, ఇంగ్లీషు పేర్లలో ఏ పేరో తెలియడం లేదు.) నామకరణం అనేది దంపతులు చేయాల్సిన పని. నామ దాస్యవహే అని ద్వివచనం. ఇప్పుడు కొత్త యుగంలో వీళ్ళు పుస్తకాలని చూసుకొని కొత్త పేర్లని పెడుతున్నారు. కొందరు కొత్త పేర్లు పెట్టాలని మన పేర్లు మర్చిపోతారు. అలా ఉన్నప్పుడు మనదేశ సంస్కృతిని మరల చెప్పుకోవాల్సిన అవసరం ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చింది కాని స్వ – తంత్రం రాలేదు. స్వాతంత్ర్యం అంటే ఇండిపెండెన్స్. స్వ–తంత్రం అంటే శాస్త్రం. స్వ అంటే మన యొక్క శాస్త్రం. మన దేశంలో మన భాష, సంస్కృతి, జుట్టు, బొట్టు, కట్టు, విషయాలన్నీ కూడా ప్రచారానికి రావాలి. అప్పుడే పూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టు అవుతుంది. అందుకని ఆ తంత్రం అనే శాస్త్ర అర్థంలో మన స్వతంత్రాన్ని పొందాలి. స్వాతంత్ర్యం అనే దానికి అర్థం మారింది. ఎవరూ ఎదురు చెప్పకూడదు

అనేదే స్వాతంత్య్రం అనుకుంటున్నారు. మార్గదర్శనం కూడా అవసరం లేదు అని అనుకుంటారు. అది స్వతంత్య్రం కాదు. మహర్షులు, యోగులు, సిద్ధులు, వేదశాస్త్ర, ఉపనిషత్తులు ఏమి మనకి చెప్పినాయో ఆ విషయాల్ని పాటించడానికి ప్రయత్నం చేయాలి. దానికి సంస్థలు అవసరం. దాని కోసమే "శ్రీ కామకోటి తౌర్యత్రిక సభ" ప్రారంభించాం. ఎందుకో తెలియదు 'తౌర్యత్రిక' అని కొత్తగా చెప్పాము. నృత్య, గీత, వాద్యాలను తౌర్యత్రికం అంటారు. వాద్యం అంటే మృదంగం, తబలా, కంజీరా లాంటి అఅర్‌తీబఎవత్ం. నృత్యం అంటే భరతనాట్యం వంటి శాస్త్రీయనృత్యం. గీతం అంటే వాగ్గేయకారుల పాటలు. మూడు కలిపి ప్రచారం చేయడానికి శ్రీ కామకోటి తౌర్యత్రిక సభ అని మొదలుపెడుతున్నాము.

నలమహారాజు అని గొప్పరాజు ఉండేవారు. ఆయన ఒకరోజు ఉద్యానవనానికి వెళ్ళారు. మహారాజు కదా ! ఆయనకి స్వాగతం పలకాలి. అభినందనలు చెప్పాలి. ప్రశస్తి మంత్రం చదవాలి, ఏకాంతంగా వెళ్ళినా ఆయనకు మర్యాద, గౌరవం ఇప్పించాలి అని




ప్రకృతి (nature) భావించింది. అక్కడ ఉన్న బావి నీటిలో అలలు వస్తున్నాయి. ఆ అలలు అక్కడ ఉన్న ఇటుకను తాకటంతో ఒక శబ్దం ఆవిర్భావమయింది. అది చూస్తే వాద్యం వాయించినట్టుంది. అక్కడ ఒక పికం అరవటం అనేది ఒక మాధుర్యం. పాట పాడినట్టు ఉండేదిట. ఆ తోటలో నెమలి భరతనాట్యం చేసినట్టు ఉండేదిట. అలా ఆ మహారాజుకి వాద్యం, గీతం, నృత్యంతో స్వాగతం పలికినట్టు ఉండేది అని వర్ణిస్తున్నారు. 'విలాస వాపీ తటవీచి వాదనాత్' అక్కడ వీచే అలలు వచ్చి వాద్య సహకారమిచ్చినట్లు ఉంది. స్వస్థా స్వభావ మధురా అంటారు అమ్మవారి గురించి. అలా మధురమైన స్వరంతో పికము పాడినట్టు ఉంటుంది. శిఖి అంటే నెమలి. శివుని రుద్రతాండవం లాగా కాకుండా నెమలి నాట్యం లలితమైన లాస్యంలా ఉంటుంది. (రుద్ర తాండవం అంటే శంకరాచార్యులవారు శివానందలహరిలో నా కఠినమైన మనస్సులో నర్తనం చేయడానికి మీరు హిమాలయంలో నాట్యం నేర్చుకున్నారా స్వామి అని శంకరులని అడుగుతారు) 'వనేపి తౌర్యత్రికం ఆరరాధతం'. వనములో కూడా నృత్య, గీత వాద్యములు మహారాజును గౌరవించాయి. శ్రీహర్ష కవి వ్రాసిన నైషధ చరిత్రలోని తౌర్యత్రికం అనే మాట ఈ కొత్త సభకి పేరుగా పెట్టాం.

ఆంధ్రదేశంలో కళారంగం, సంగీతరంగం, వాద్యరంగాలలో మంచి సేవాకార్యక్రమాలు చేయడానికి అక్కడక్కడ స్ఫూర్తిదాయకమైన, ప్రేరణదాయకమైన, సద్భావన ఉత్పాదకమైన ఈ కార్యక్రమాలు చేయడానికి మంచి సంఘాన్ని మీరందరు ఏర్పాటు చేసుకున్నారు. దీనికి కళా, శాస్త్ర, పురాణ వ్యాసపీఠంలో ఉండే అందరూ సహాయసహకారాలు అందించడానికి ముందుకు వచ్చారు. మన దేశంలో రాజకీయం లేని విషయంలో ఇతరుల నేతృత్వం అవసరం. మంచి హెడ్మాష్టారు, ప్రిన్సిపాల్, పురోహితులు, ఉపాసకులు, అక్కడక్కడా కొన్ని విషయాలలో మంచి ధర్మకర్తలు కూడా అవసరం. దేశ పురోగతికి, ఉన్నతికి ఇది అవసరం. అందుకని నాన్ – పొలిటికల్ లీడర్‌షిప్ కావాలి. దీనికోసం పాతసభలన్నీ కూడా ఇంకా బలంగా తయారు చేయాలి. అనేక సంస్కృత పాఠశాలలు, సంగీతసభలు, అక్కడక్కడ ఏర్పాటు చేస్తున్నారు. అన్నింటికీ కూడా సహాయ సహకారాలు, పౌరులు, విదేశాలలో ఉండే NRI\T అందరూ అందించాలి. ఆంధ్రదేశంలో మన సాహిత్యం, సంగీతం, కళ, అవధానప్రక్రియ ప్రచారం చేస్తూ తద్వారా ధర్మానికి విరుద్ధం లేని మనోరంజకమైన విషయాల్ని ప్రజలకు అందించాలి. మనోరంజకం అనే దృక్పథంతో మనస్సుకు కష్టాన్ని కలిగించే విషయాన్ని



చెప్పకూడదు. గంధం ముందు తీస్తున్నప్పుడు ఇబ్బందిగా ఉంటుంది, తర్వాత చక్కటి సుగంధాన్ని ఆస్వాదించవచ్చు. అలా కాకుండా పాశ్చాత్య విషయాలు చూడటానికి, తినడానికి, వినడానికి సులభంగా ఉంటున్నాయి. తరవాత మనకు నిద్రపట్టదు. జీర్ణంకాదు. మన సంస్కృతి ఎలా అంటే ఆయుర్వేదం వైద్యంలా కొంచెం నిదానంగా పనిచేస్తుంది. కాని సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఇంకేమీ ఆపదలుండవు. సంగీతం అనేది మన నరాలకి, మనస్సుకి, ఇడ పింగళ సంచారానికి ప్రాణాయామ తుల్యము. ఇది ఒక నాదోపాసన. ఆంధ్రరాష్ట్రంలో ఉన్న విషయాలను భక్తిపూర్వకంగా, శ్రద్ధగా, స్నేహంగా చేయగలగాలి. అరవదేశంలో ఎన్నో విషయాలు, పరిస్థితులు లౌకికంగా ఉన్నా అక్కడ నుండి తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయి. అందుకని భాషాబేధం లేకుండా అందరూ కలుసుకొని ఆంధ్ర గుణము – అరవ తెలివితేటలు లాగా ఉండాలి. పుణ్యం, పాపం, భక్తి, సదాచారం, స్నానం, సంధ్య, ఉపవాసం, నిరాహారదీక్ష, సంకల్పాలు, వ్రతాలు, పునశ్చరణ అవన్నీ మీ ఆచారం ఏముందో అదే పెట్టుకోవాలి. దానిలో ఏ మార్పు రాకూడదు. సంగీతం, భరతనాట్యం, నమక చమకాలు ఇవన్నీ అక్కడ నుండి నేర్చుకోవాలి. అందుకని ఎక్కడ ఏది మంచి ఉందో దాన్ని గ్రహించాలి.

'సర్వోపమా ద్రవ్య సముచ్చయేన యథాప్రదేశం వినివేశితేన సా నిర్మితా విశ్వసృజా ప్రయత్నాత్ ఏకస్థ సౌందర్య దిదృక్షయేవ'. అలా పార్వతిని సృష్టించారు బ్రహ్మదేవుడు. ఒకేచోట అన్ని సౌందర్యాలు చూడాలని బ్రహ్మదేవుడు అనుకున్నారట. అందం, మాధుర్యం, గుణం, భక్తి, సదాచారం, వినయం అన్ని ఒక్క చోట కనిపిస్తే, ఆవిడే పార్వతీదేవి అనుకోవాలి. కాని ఇప్పుడు మనం ప్రతివిషయాన్ని విడివిడిగానే చూస్తున్నాం. కర్నూలులో 1983లో స్వామివారి దర్శనం చేసుకున్నప్పుడు వారు శివుని గురించి చెప్పారు. 'గుణ దోషౌ బుధో గృహ్ణన్ ఇందుక్ష్వేళావివేశ్వరః శిరసా శ్లాఘతే పూర్వం పరం కంఠే నియచ్ఛతి' లోకంలో గుణం, దోషం అని రెండు ఉంటాయి. మనం గుణం గ్రహించాలి, దోషాన్ని గ్రహించకూడదు. పరమేశ్వరుడు అందంగా ఉండి, చూడడానికి ఆహ్లాదంగా కనిపించే చంద్రుడిని శిరస్సుపై పెట్టుకున్నారు. ఏది ఇబ్బంది కలిగిస్తుందో, లోకానికి అందించకూడదో, ఆ విషాన్ని ఆయన కంఠంలో పెట్టుకున్నారు అని ఈ శ్లోకాన్ని చెప్పి కంచిమహాస్వామివారు మాకు అర్థం వివరించారు. ఏది మంచిదన్న విషయం మనం తెలుసుకొని జీవితంలో అభివృద్ధి



మనం బయట కనబడే విషయాలనే అలంకారం అంటాం. సంగీత, సంస్కృతాలలో అలంకారం అంటే మాటను ఎలా పలకాలి అని తెలియజేస్తుంది. పోతన భాగవతంలో రాములవారి గురించి మృదుభాషి, స్మితభాషి, పూర్వభాషి అని వర్ణించారు. అలా ఉచ్చారణ, అలంకారం అనేవి శబ్ద శాస్త్రంలో గొప్ప విషయాలు. అందరూ భక్తి పూర్వకంగా కలిసి రథోత్సవాన్ని ఎలా చేస్తారో అలా అందమైన శ్రీ కామకోటి తౌర్యత్రిక సభ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి.

'స్త్రీ బాల వృద్ధ బుధ పామర నిర్విశేషం ఆనందయంతం అఖిలం ప్రణమేమ నిత్యం' మహాస్వామివారి గురించి ఒకరు పద్యం వ్రాశారు. స్త్రీలు, పిల్లలు, పెద్దవయస్సువాళ్ళు, చదువుకున్నవాళ్ళు, చదువుకోనివాళ్ళు అందరూ స్వామివారిని చూసి సంతోషిస్తారు. స్వామివారి సందర్శనం చేస్తే అందరికి మనసులో నమ్మకం, ప్రీతి, శ్రద్ధ, ధైర్యం కలుగుతాయి. అంటే ఆయన మమ్మల్నే చూశారు, నన్నే చూశారు అనుకుంటూ ఉంటారు. వెయ్యి మంది ఉన్నా ఆయన అందరినీ సంతోషంగా, ఆశీర్వచనం చేసి పంపిస్తారు. నిరంతరంగా మనం ఆ ఆశీర్వచనం యొక్క ప్రయోజనాన్ని పొందేలా ఇలాంటి కార్యక్రమాలలో మీరందరూ కలుసుకొని అందరికీ సంతోషం కలిగించాలి. మీరూ ఆత్మతృప్తిని పొంది ఈ సేవా కార్యక్రమాలను ఉత్తరోత్తరం మంచిగా చేయాలి.

చెందడానికి అవకాశాన్ని వాడుకోవాలి. ఆంధ్రా, తెలంగాణాలలో సంగీత, వేద, శాస్త్ర, పురాణ ప్రవచనాలు బాగా జరుగుతున్నాయి సంగీతరంగంలో, వాద్యరంగంలో, కళారంగంలో మీరందరూ కృషి చేస్తూ తద్వారా మనస్సుకు ప్రశాంతత చేకూర్చుకోవాలని మా కోరిక.

'కర్పూర స్ఫటికేందు సుందర తనుం కైలాసే కమనీయ రత్నఖచితే కల్పద్రుమూలే స్థితం' రత్నం అనేది కమనీయం. అంత అందంగా ఉందిట కైలాసం. 'కల్పద్రుమూలే స్థితమ్' కల్పతరువు క్రింద కూర్చుని ఉన్నారాయన. కర్పూర స్ఫటికేందు సుందర తనుమ్ కాత్యాయని సేవితమ్. తెల్లని శరీరం. తెల్లని శరీరానికి మూడు ఉదాహరణలు చెప్పారు. కర్పూరం, స్ఫటికం, చంద్రుడు. అలాంటి శివుడిని పార్వతీదేవి పూజిస్తున్నది. పార్వతీదేవి అలా పూజించిన స్థలమే కంచి. 'చింతయ మాకందమూల కందం చేతః శ్రీ సోమాస్కంధం' అని ముత్తుస్వామి దీక్షితులు పాడినట్లుగా వర్ణన ఉంది. సంగీతంలో ముత్తుస్వామి దీక్షితర్, నారాయణతీర్థుల (విజయవాడ దగ్గర నారాయణతీర్థ స్వామికి గుడి కూడా కట్టారు) యొక్క సంస్కృత సాహిత్యాన్ని సంగీతంలో ప్రచారం చేయాలని ప్రయత్నం కూడా జరుగుతున్నది. 'గంగా తుంగ తరంగ రంజిత జటాభారం కృపాసాగరమ్ కంఠాలంకృత శేషభూషణమముం మృత్యుంజయం భావయే' అని అలంకార స్తోత్రంతో మొదలుపెట్టారు.





## రామాయణం ఆడియో రూపంలో చేయాలి :

**కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్ ।**
**ఆరూహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్ ॥**

ఇది వరకు 'నడిచే దేవుడు' పుస్తక రూపంలో వచ్చింది. దానిని మన ప్రయాగ రామకృష్ణగారు ఆయన మధురమైన స్వరంతో అంటే మాత్రాకాలం, అర్ధమాత్రాకాలం, ఏకమాత్రాకాలం, ద్విమాత్రాకాలం ప్రకారంగా విడమరచి చెప్పారు. తమిళ్‌లో డిక్షనరీ పేరు వినే ఉంటారు. స్వామినాథ అయ్యర్ అనే ఆయన తమిళ భాష కోసం తాళపత్ర గ్రంధాలను, ఎన్నో పుస్తకాలను వెతికి వెలికి తీశారు. స్వామినాథ అయ్యర్ తమిళ భాషని కాపాడారనే చెప్పాలి. ఆయన ఒక డిక్షనరీ పబ్లిష్ చేశారు. దానిలో తమిళ భాషని ఎట్లా ఉచ్చారణ చేయాలని తయారు చేశారు. ఆ ఉచ్చారణ కోసం ఇప్పుడు మేము ఒక ఆడియో తయారు చెయ్యమని చెప్పాము. అంటే పుస్తకంలో ఉంటే చాలదు. ఆ ఉచ్చారణం, అల్పప్రాణం, మహాప్రాణం, స్వరాలు అన్ని చెప్పాలి. ఆ కాలంలో మీరు పొలంలో పనిచేసే రైతులను చూసుంటారు. పంపుసెట్లు రాకముందు ఒక విధానం ఉండేది. పాట పాడుతూ తాటి కర్రల పైన ఎక్కి తొక్కుతారు. నీరు పైకి వచ్చేది. అలా పాటలు పాడుతూ అన్ని పనులు చేస్తారు. అలా ధ్వని మాత్రాకాలం అంటే య, మా, తా, రా, జ, భా, న, స అని వృత్త లక్షణం చెబుతారు. సంస్కృత కావ్యాలు వ్రాసినప్పుడు యగణం, మగణం, తగణం, రగణం, జగణం, భగణం, నగణం, మాత్రాకాల అనుస్వరం ఇవన్ని ఉండాలి. (యమాతా అంటే – మొదట లఘువు, రెండు మూడు అక్షరాలు గురువు. మాతార అంటే –మొదటిది, రెండోది గురువు, మూడవది లఘువు. తారజ అంటే మొదటిది గురువు, రెండుమూడు లఘువులు. అలా శార్దూల విక్రీడితం, అనుష్టుప్, త్రిష్టుప్ జగతి అలాంటి వృత్తాలు వ్రాసినప్పుడు వృత్త రత్నాకరం అనే పుస్తకంలో ఈ గుణాలు ఉండాలని చెబుతారు.) అక్షరరాశికి కంపం, అనుకంపం రెండూ అవసరం. మూకపంచశతిలో అనుకంప – మాది – మామీక్షే అంటారు. అనుకంపం ఉంటేనే కంపం రాకుండా ఉంటుంది. కంపం అంటే భయం. 'అంబాకంపప్రద కంపానదీ కూల విలసత్ తపః కామాక్ష్యాలింగిత శ్రీశ్రీఏకామ్రనాథ సంశోభితే' అంటే కంపానది అని కంచిలో ఉంది. కంప అన్న పేరు ఎందుకు వచ్చిందంటే అమ్మవారికి భయం కలిగించిందిట. అందువల ఆవిడ శివుణ్ణి ఆలింగనం చేసుకుందట. అందుకని అమ్మవారికి కంపనం కలిగించిందని కంపానది అని చెబుతారు. మన శబ్ద ఉచ్చారణలో మాత్రాకాలం, స్వరాలు ముఖ్యము. దృశ్యము, శబ్దము కూడా ముఖ్యమే. ఆ కాలంలో దశరథ మహారాజుకు శబ్దభేధి అనే విద్య ఉండేది. వేటలో ఉన్న రాజు ఒక శబ్దం విని (ఏనుగు నీరు తాగుతోందని అనుకొని) తెలియకుండా బాణ ప్రయోగం చేశారు. అది శ్రవణకుమారుని తల్లిదండ్రులకి ఇబ్బంది కలిగించింది. అందుకని శబ్దం ఒక్కోసారి మంచిని కలిగిస్తుంది. ఇంకో సమయంలో ఎక్కడో మనకి ఇబ్బంది కూడా కలిగిస్తుంది. మనము గట్టిగా అరుస్తూ 'అలానా' అంటే ఒక అభిప్రాయం కలుగుతుంది. మనము నెమ్మదిగా, మృదువుగా 'అలానా' అంటే ఒక అభిప్రాయం కలుగుతుంది. అందుకని ఉచ్చారణలో భావబేధాలు రాకుండా, ద్వేషం రాకుండా పలకడానికి మాధుర్యం అవసరం. అందుకని ఆ మాధుర్యం గురించి ఒక కవి చెబుతున్నారు.

'సీతాపురాగ ఘనచారి భిరక్ర దృష్టా సీతాపురగ ఘనచారి భిరక్త దృష్టా మాహూదియం సకల మానవ నేత్ర పాత్రం ఇత్యాకలై యనియతం భిరదే విధాత భాష్పోదకేన నయనాని శరీర భాజాం'

అంటే సీతాదేవి రాజప్రాసాదం నుంచి వనవాసానికి రాములవారితో 'నేను వచ్చే తీరుతాను' భర్త ఎక్కడ ఉన్నాడో అదే అయోధ్య అని చెప్పి బయలుదేరుతుంది. ఆ కాలంలో 'అసూర్యం పశ్యాః రాజధారాః' అంటారు. అంటే రాజకుటుంబంలో స్త్రీలు



సూర్యుడిని కూడా చూడరు అంటారు. లోపలే ఉంటారు అని అర్థం. అలాంటి అమ్మవారు బయటకి వస్తోందంటే ఆవిడ ఎవరినీ చూడదు. అందరూ ఆవిడని చూడకూడదు అవి కవి భావన.

కాశీ మహారాణి పరదా పద్ధతిలో ఉండేవారు. కంచి మహాస్వామివారు ఒక 35సంవత్సరముల ముందు ఆవిడకి వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం ఏర్పాటు చేశారు. ఆఫీసర్లకి ఆవిడ పరదాతోనే వస్తుంది, మీరు దర్శనానికి ఏర్పాటు చేయండి అని చెప్పారు. అంటే కొందరు వారి ఆచారాన్ని పాటిస్తున్నప్పుడు మనం వారిని గౌరవించాలి. ఆంధ్రదేశం యొక్క ఆచారం అదే. సుబ్రహ్మణ్యం లాంటి అగ్నిహోత్రికులు ఉంటే వారికి బంగారం ఇవ్వటం లాంటివి చేయడం జరుగుతోంది. ఎంతమంది ఉన్నారనేది కాదు విషయం. ఎవరైనా సరే మన ప్రాచీన ధర్మాన్ని పాటిస్తే వారిని మనం గౌరవించాలి. ఇది స్వామివారి అభిప్రాయం. అందుకే కాశీ రాణికి ఏర్పాటు చేశారు. సీతాదేవి రాజాప్రాసాదం నుండి బయటకు వస్తే ఇది వరకు ఎవరూ చూడలేదు కదా ! ఇప్పుడు ఆమెని ఎవరైనా చూడవచ్చా అని బ్రహ్మదేవుడు అనుకున్నారట. ఆవిడని ఎవరూ చూడకూడదు, గొప్ప పతివ్రత అనుకొని ప్రజల కళ్ళల్లో నీళ్ళు సృష్టించారట. సీతాదేవి బయటకు వచ్చాక చూసి కళ్ళల్లో నీరు వచ్చిందా ? అంటే అలా కాదు. బయటకు రాబోతోందని విన్న సందర్భంలోనే వీరికి కంటి నుండి నీరు వచ్చేసింది. అందుకని బయటకు రావటం, వనవాసానికి వెళ్ళడం చూడలేకపోయినారు. అందువల్ల ధ్వని అనేది ముఖ్యం.

కనకధారాస్తోత్రంలో కూడా 'భవతి భిక్షాందేహి' అని శంకరాచార్యులు చెబుతున్నప్పుడు మాధుర్యమైన, లలితమైన, శైశవ కంఠాన్ని విని ఇంటి ఆవిడ బయటకు వచ్చారు. వచ్చి చూసిన తరువాత ఇంకా కష్టపడింది ఆ తల్లి. శబ్దం వినేటప్పుడే ఆ భావం వచ్చేసింది. అందుకని శబ్దోచ్చారణం అనేది చాలా ముఖ్యం. రామకృష్ణగారికి తెలుగు సాహిత్యంలో నైపుణ్యం ఉన్నందువల్ల ఆరోజుల్లో ఆడియో



చేయగలిగారు. ఇప్పుడు మనవారికి సమయం లేదు. ట్రాఫిక్‌లోనే వీరికి సమయం దొరుకుతుంది. అందుకని ఆడియో చేస్తే మంచిదనే ఒక అభిప్రాయంతో రామాయణాన్ని కూడా వచన బద్ధంగా 'శ్రుతిపథం' చేయాలి అనుకున్నాం. 'కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్, ఆరూహ్య కవితాశాఖామ్ వందే వాల్మీకి కోకిలమ్' అన్న మధురమైన శబ్దం మీ అందరికీ వినిపించాలని ఈ ప్రయత్నం. అందుకని మీరందరూ వేదశాస్త్రమును కాపాడుకున్నట్టు, గౌరవిస్తున్నట్టు, సేవచేస్తున్నట్టు కళారంగంలో కూడా చేస్తే మన సమాజం సమగ్రమైన వికాసం పొందుతుంది. ఆమూలాగ్రం వికాసం ఉంటుంది. సప్తప్రాకార వికాసాన్ని పొందుతుంది. ఎలా శ్రీరంగంలో సప్త ప్రాకార గర్భగుడిని మీరు మంచిగా కాపాడుతున్నారో దానితో పాటు ఇవన్నీ కూడా కాపాడటానికి ప్రయత్నం మహా ఫలితాన్ని ఇస్తుందనే విశ్వాసంతో ఈ కార్యక్రమాన్ని మొదలుపెడుతున్నాం.

***హరహర శంకర జయజయ శంకర***

*

# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి విజయయాత్రా విశేషాలు

## తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న స్వామివారు







**15-05-23** (సోమవారం, ఏకాదశి) – పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు తిరుమలను సందర్శించగా ఆలయ మర్యాదలతో తిరుమల తిరుపతి దేవస్థాన ఈ.ఓ, మరియు వేదపండితులు పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారు ఏడుకొండలస్వామిని దర్శించుకుని, వింజామర సేవ చేశారు. శ్రీ కంచి కామకోటి పీఠం భక్తులు పెద్దసంఖ్యలో తిరుమల చేరుకొని స్వామివారి సమక్షంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని దివ్యమైన అనుభూతిని పొందారు.






**16-05-23** (మంగళవారం, సాయంత్రం) తిరుమలలో జరుగుతున్న హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన నాద నీరాజనం వేదికపై పూజ్యశ్రీ స్వామివారు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం చేరుకుని అక్కడ జరుగుతున్న సుందరకాండ సంపూర్ణ అఖండ పారాయణం, తదనంతర పూర్ణాహుతి కార్యక్రమంలో స్వామివారు పాల్గొని అనుగ్రహ భాషణం చేసి, భక్తులను ఆశీర్వదించారు.

**17-05-23** తిరుమలలోని నాద నీరాజనం మండపమందు బుధవారం ఉదయం జరిగిన అయోధ్యకాండ పారాయణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పూజ్యశ్రీ స్వామివారు పాల్గొని అనుగ్రహ భాషణం చేసి భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి గారు కూడా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.






**23-05-23** (ఉదయం) తిరుపతిలోని శ్రీ కంచి కామకోటి పాదుకా మండపంలో నిర్వహించిన గణపతి హోమం పూర్ణాహుతి కార్యక్రమంలో స్వామివారు పాల్గొని, భక్తులను తీర్థ, ప్రసాదాలతో ఆశీర్వదించారు.



**24-05-23** (బుధవారం, సాయం(త్రం) - పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు తిరుపతి లోని గంగమ్మ దేవాలయం, నలగంపల్లిలోని శ్రీ విరూపాక్షిణి దేవాలయం,గోశాల మరియు మొగిలిలోని శివాలయం సందర్శించుకుంటూ భక్తులను ఆశీర్వదించి అనంతరం బెంగుళూరు శ్రీమఠం శిబిరానికి చేరుకున్నారు.





**30-05-23** (మంగళవారం) - పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు దండుపాళ్యం హెూస్కోటే సమీపంలోని శివాలయం మరియు MVJ వైద్య కళాశాల మరియు పరిశోధనా కేంద్రాన్ని సందర్శించి భక్తులను అనుగ్రహ భాషణం మరియు ప్రసాదాలతో ఆశీర్వదించారు.

# శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామివారి జయంతి మహోత్సవం









కాంచీపురంలోని శ్రీమఠంలో పూజ్యశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామివారి 130వ జయంతి మహోత్సవం జూన్ 1వ తారీకు ఉదయం వేదపారాయణం, రుద్రాభిషేకం, విశేష పూజలు, విద్వత్ సదస్సులతో ప్రారంభమైంది. మహాస్వామివారి జయంతి జ్యేష్ఠమాసంలో అనూరాధ నక్షత్రం జూన్ 3, 2023 రోజున జరిగింది.

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA

## SRI KANCHI KAMAKOTI PEETAM

**Jagadguru Shankaracharya Swamigal**
**Shrimatam Samsthanam, Kanchipuram**





# Vijaya Yatra
of
# Jagadguru Pujyashri Shankara Vijayendra Saraswathi Shankaracharya Swamigal

## Schedule upto 29 Sep. 2023

**3rd July 2023 - Vyasa Puja at PRAYAGRAJ**
**Upto 29th Sep. 2023 - Chaturmasyam at VARANASI**

| DATE | PLACE | PLACE OF PUJA |
|---|---|---|
| **KARNATAKA** | | |
| Upto 8th June | Bengaluru | Kamalalayam, 25, Nimbekaipura Road, Virgo Nagar Post |
| **ANDHRA PRADESH** | | |
| 8th Eve. to 9th Morn. | Anantapur | Sri Abhayaanjaneya Swamy Temple (Place of Halt only) |
| 9th & 10th June | Kurnool | Sri Shankara Mandir, Khanderi, Chidambarao Street (Fort) |
| 10th Eve. to 11th Morn. | Dundigal | Mahavidya Peetam, Airforce Academy Road, Near Exit 5, Dundigal, Nehru Outer Ring Road (Place of Halt only) |
| **TELANGANA** | | |
| 11th to 13th Jun. | Wargal | Sri Kanchi Peetam Sri Vidya SaraswatiTemple, Wargal, Siddipet |
| 14th to 17th Jun. | Nizamabad | Kanyaka Parameswari Temple, Market Road, Nizamabad |
| 18th Jun. | Nirmal | Nirmal Brahmana Seva Sangham, Kalyana Mandapam, Brahmapuri, Nirmal |
| 19th & 20th Jun. | Adilabad | Ramalayam ,Tirupalli, Opp. Railway Station, Adibalabd |
| **MAHARASHTRA** | | |
| 21st & 22nd Jun. | Nagpur | Bhagavatpada Sabha, Ramnagar, Nagpur |
| 23rd to 25th Jun. | Ramtek | Kavikulguru Institute of Tech. & Sci., Moudha Road, Ramtek |
| **MADHYA PRADESH** | | |
| 26th & 27th Jun. | Jabalpur | Sri Balaji Temple, 431 Marhatal, Jabalpur |
| 28th Jun. | Rewa | Saraswathi Sishu Mandir, Nirala, Rewa |
| **UTTAR PRADESH** | | |
| 29th Jun. to 5th July | Prayagraj | Sri Shankara Vimana Mandapam, Triveni Road, Beni Bandh<br>3rd July 2023 - VYASA PUJA |
| 6th July to 29 Sep. | Varanasi | Sri Kanchi Kamakoti Peetam -Kashi Branch, Hanuman Ghat, Varanasi<br>CHATURMASYA VRATAM at VARANASI |

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

# శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయ



## (ఏనాతూర్, కాంచీపురం, తమిళనాడు)

శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయ, UGC చట్టం 1956 సెక్షన్ 3 క్రింద తమిళనాడు రాష్ట్రంలో శ్రీ కంచి కామకోటి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించబడుతున్న మొదటి ప్రైవేట్ విశ్వవిద్యాలయం. విద్యను ప్రోత్సహించాలనే ప్రాథమిక లక్ష్యంతో 1976వ సంవత్సరంలో ప్రారంభించబడింది. శ్రీ కంచి కామకోటి పీఠం 68వ ఆచార్య జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామివారి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 1983లో డీమ్డ్ యూనివర్సిటీ హోదాను పొందింది. వైద్యం, పురాతన సంప్రదాయ కళలు, సంగీతం, సంస్కృతి, ఇతర ప్రజాప్రయోజన కార్యక్రమాలు నిర్వహించడం, అభివృద్ధి చేయడం దీని లక్ష్యం.

కంచి కామకోటి పీఠంవారి పవిత్రమైన ఆశీస్సులతో న్యాయ, వ్యాకరణ, వేదాంతం, సాహిత్యం వంటి శాస్త్రాలను సంరక్షించే లక్ష్యంతో కె.వి.దమాని, కాలేజ్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్ 1976లో స్థాపించబడింది. రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్, న్యూఢిల్లీకి అనుబంధంగా ఉంది. దీనిలో విద్య ప్రారంభించడానికి ప్రాక్‌శాస్త్రి (ఇంటర్మీడియట్), శాస్త్రి(బి.ఎ.) కోర్సులను అందిస్తోంది. 1978లో ఆచార్య (M.A.)ని నాయ, సాహిత్యం శాస్త్రాలలో నిర్వహించడానికి సంస్థ ఆమోదం పొందింది.

మే 26, 1993వ సంవత్సరంలో భారత ప్రభుత్వం ఈ సంస్థను అప్‌గ్రేడ్ చేసి, శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయగా ఆమోదించబడిన పేరుతో డీమ్డ్ యూనివర్సిటీగా ప్రకటించింది. తద్వారా సాంకేతిక, ఆధునిక శాస్త్రాలలో కోర్సులను అందించడానికి విశ్వవిద్యాలయాన్ని అనుమతించింది. సాంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రాలతో కలపడం దీని లక్ష్యం.

దాదాపు మూడు దశాబ్దాల ప్రస్థానంలో నిరాడంబరమైన ప్రారంభం, SCSVMV దాని గత ప్రయోగాలు, అనుభవాల నుండి నేర్చుకుంటూ ప్రగతిశీల, సమగ్రపద్ధతిలో తనను తాను తిరిగి తీర్చిదిద్దుకోవడం ద్వారా తన అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగించింది.

విద్యార్థులలో పోటీతత్వం, సామర్థ్యం, లక్ష్యం చేరడానికి మంచి అధ్యాపక బృందం అందుబాటులో ఉంది. యోగ్యత, సామర్థ్యాల అంచనాలకు అనుగుణంగా జీవించగలిగేలా విద్యార్థులను సిద్ధపరిచే ప్రభావవంతమైన అధ్యాపక నిర్వహణ కలిగి ఉన్నది. దీర్ఘకాలంలో కార్యనిర్వాహక నైపుణ్యం, సంస్థ చురుకుదనం, స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది. విద్యా సమర్థత కోసం ఆకాంక్షిస్తున్న విద్యాలయమిది. SCSVMV సంస్థ ప్రధానంగా ఉపాధ్యాయులు, బోధనా పద్ధతుల ద్వారా సేవలందిస్తుందని విశ్వసిస్తున్నారు. మేము విద్యా సంవత్సరానికి విద్యార్థుల నాణ్యతలో

ప్రతిబింబించే వ్యక్తిత్వ వృద్ధిని పెంపొందిస్తున్నాము. మా అధ్యాపకులు పాటించే క్రమశిక్షణ, అంకితభావం, అభిరుచి, మా విద్యార్థుల ప్రవర్తన, చర్యలలో స్వయంచాలకంగా కనిపిస్తాయి. లోతుగా ఇమిడిన భారతీయ సాంప్రదాయం, సంస్కృతి, పర్యవసానంగా వచ్చిన నైతిక విలువలతో కూడిన ప్రవర్తన విద్యార్థులను తీర్చిదిద్దుతోంది.

సాంస్కృతిక, సామాజిక, సామరస్యం, మెరుగైన భావోద్వేగ వ్యక్తీకరణ, సంగీతం, యోగా, పెయింటింగ్, శిల్పం మొదలైన వాటిని నేర్చుకోవడానికి విశ్వవిద్యాలయం ప్రాథమిక వేదికను కూడా సిద్ధం చేసింది.

## విద్యావిషయక సదుపాయాలు :

విద్యావిషయక సదుపాయాలు అనేది SCSVMV ప్రధాన అంశంగా ఉంది. ఇది యూనివర్సల్ లెర్నింగ్ స్పేస్‌ను అందజేస్తుంది. విద్యాసంబంధమైన వాతావరణం వ్యక్తిత్వంతోపాటు జట్టులోనూ శ్రేష్ఠతను ప్రోత్సహిస్తుంది. విద్యాలయము విద్యార్థులకు సురక్షితమైన, సంరక్షణ, ఉత్సాహపరిచే వాతావరణాన్ని అందిస్తోంది. కోవిడ్ అనంతర కాలంలో తప్పనిసరిగా విద్యార్థుల డిమాండ్ పెరగడంతో, పెరిగినదానికి తగినట్లుగా విశాలమైన తరగతి గదులు, వసతి స్థలాలు నిర్మించబడ్డాయి.

నేర్చుకోవడం అనేది SCSVMV క్యాంపస్‌లో ఒక జీవన విధానం. మేము ప్రతి విద్యార్థికి వారి వ్యక్తిత్వానికి అనుగుణంగా రాణించేలా విద్యావిషయాలు, క్రీడలు, కళల మధ్య సరైన సమతుల్యత అందిస్తాము. SCSVMV ప్రతిభావవంతమైన అభ్యాసానికి మద్దతుగా కళలు, సైన్స్, క్రీడలలో అత్యాధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నది. అంతే కాకుండా SCSVMV అత్యుత్తమ విద్యా కార్యక్రమాలను రూపొందిస్తోంది.

ఇది విద్యార్థులను ప్రయోగాత్మక శిక్షణలో శక్తివంతం చేస్తుంది. సాంకేతికత ద్వారా స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, వర్చువల్ రియాలిటీ పరికరాలతో కూడిన ఐటి ల్యాబ్‌లు, ఆధునిక శాస్త్రీయ ప్రయోగశాలలు, వర్క్‌షాప్‌లు, ప్రతిభ అభివృద్ధికి సృజనాత్మక ప్రదేశాల ద్వారా శిక్షణ ఇవ్వబడుతోంది. సంక్షిప్తంగా SCSVMV విద్యార్థులకు వరం లాంటిది. స్వయం ప్రతిభను తెలుసుకోవడానికి వీలుకల్పిస్తోంది.

## భౌతిక మౌలిక సదుపాయాలు :

విద్యాలయము భౌతిక, మౌలిక సదుపాయాలతో విద్యార్థులకు బలమైన బంధాన్ని కలిగిస్తోంది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందించే విశాలమైన గదుల నిర్మాణం, క్యాంపస్‌లోనే వైద్యసదుపాయం, సానుకూల వాతావరణంతో మంచి హాస్టల్ సౌకర్యాలు, భద్రతకు హామీ, మంచి లైబ్రరీ ఉన్నాయి.

## విద్యార్థుల కోసం వసతి :

విశ్వవిద్యాలయంలో హాస్టల్‌లో ఉండటం అనేది విద్యార్థి జీవితంలో ముఖ్యమైన అంశాలలో ఒకటి. ఎందుకంటే ఇది విద్యార్థులు విశ్రాంతి తీసుకోవడానికి, అభ్యాసం కోసం, వ్యక్తిత్వం ఏర్పడం కోసం కృషి చేసే ప్రదేశం. SCSVMVలో తల్లిదండ్రులకు వారి పిల్లలను సురక్షితమైన, రక్షిత వాతావరణంలో జీవిస్తారని భరోసా ఇవ్వడం





జరుగుతుంది. SCSVMV ఆధునిక హాస్టళ్ళలో విశాలమైన గదులు, స్టడీ-ఫ్రెండ్లీ ఫర్నీచర్, స్టోరేజీ సదుపాయాలు, విశ్రాంతి గదులు, వినోద ప్రదేశాలు, వ్యాయామశాల, ధ్యాన మందిరం, విశాలమైన డైనింగ్ హాళ్ళు, ఆధునిక వంటగది, చదరంగం, క్యారమ్స్, టేబుల్-టెన్నీస్ సౌకర్యాలతో కూడిన ఆటస్థలాలు ఉన్నాయి. 2200మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యం కలిగి ఉంది.

## అంతర్జాతీయ లైబ్రరీ :

SCSVMV కి నాడీ కేంద్రంగా, సుసంపన్నమైన అంతర్జాతీయ లైబ్రరీ నిర్మించబడింది. 1993లో అద్వైత పరిశోధనలు అన్ని కోణాల్లో సాగేందుకు వీలుగా ఈ గ్రంథాలయాన్ని నిర్మించారు. 4640 చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ లైబ్రరీలో మూడు అంతస్తులలో విశాలమైన వసతితో కూడిన 12 విభాగాలు ఉన్నాయి. ఈ భవనం కంబోడియాలో పూర్వపు కంచి పాలకులచే స్థాపించబడిన వాస్తుశిల్పాన్ని సూచిస్తుంది. లైబ్రరీ భవనంలో 5000 కంటే ఎక్కువ అరుదైన రాతప్రతుల సేకరణ విభాగం కూడా ఉంది. దేశవ్యాప్తంగా శ్రీ కంచి కామకోటి పీఠం ఆచార్యుల యాత్రల సందర్భంగా అనేక రాతప్రతులు సేకరించబడ్డాయి. సమాజ ప్రయోజనం కోసం అవి నిరంతరం డీకోడ్ చేయబడుతున్నాయి.

## క్రీడా సదుపాయాలు :

SCSVMV మేధస్సు, క్రీడలకు విలువనిస్తుంది. విద్యార్థుల వ్యక్తిత్వ సమగ్ర వికాసానికి సాంప్రదాయ, సమకాలీన మార్గాలు, మార్గాల యొక్క ఖచ్చితమైన మిశ్రమం ద్వారా దానిని పెంపొందిస్తుంది.

SCSVMV ఆటలు, వ్యాయామశాల, అథ్లెటిక్స్, టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్, స్క్వాష్, రన్నింగ్/జాగింగ్/వాకింగ్ ట్రాక్‌లు, చదరంగం, క్యారమ్, టేబుల్‌టెన్నీస్ వంటి ఇండోర్ గేమ్స్ ఇక్కడ గల సదుపాయాలు. SCSVMV ఆధునిక లైటింగ్ సిస్టమ్‌లతో సౌకర్యాలను కలిగి ఉంది. రెండు టెన్నిస్ కోర్టులు (క్లే, సింథటిక్), బాస్కెట్‌బాల్ కోర్ట్ (సింథటిక్), కబడ్డీ మైదానం, క్రికెట్ ప్రాక్టీస్ నెట్ (ఫాస్ట్ స్పిన్ బౌలర్లకు శిక్షణ).

వ్యాయామం, యోగా స్పష్టమైన ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులకు అందుబాటులో ఉంచబడ్డాయి.

వాకింగ్ కమ్ జాగింగ్ ట్రాక్, అత్యాధునిక పరికరాలతో కూడిన ఆధునిక హానుమాన్ వ్యాయామశాల ఉన్నది అథ్లెట్లను సిద్ధం చేయడానికి, అధ్యాపకులు, విద్యార్థులందరి సాధారణ శ్రేయస్సును ప్రోత్సహించడానికి ఆధునిక కార్డియో, శిక్షణ పరికరాలతో కూడిన జిమ్, యోగా కేంద్రం, నృత్య సాధన కేంద్రం ఉన్నాయి.

బాలికల హాస్టల్ ప్రాంగణంలో వారి కోసం ప్రత్యేక వ్యాయామశాల ఇతర క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు, ఒక ఓపెన్ జిమ్ కలవు. SCSVMV గతంలో అనేక ప్రతిష్టాత్మక కప్‌లను గెలుచుకున్న బలమైన క్రీడా రికార్డును కలిగి ఉన్నది.

ఈ విధమైన యూజీసీ చట్టం 1956 యూనివర్సిటీ u/s 3గా భావించబడిన, 'A' గ్రేడ్‌తో NAAC గుర్తింపు పొందిన, అన్ని వసతులతో రూపుదిద్దుకున్న విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి : www.kanchiuniv.ac.in ఎనాతూర్, కాంచీపురం - 631561, తమిళనాడు. సంప్రదించండి: 9629032323, 9629001144, 8098001630 (ఆయుర్వేదం),

# శ్రీ కంచి కామకోటి శంకరమఠము
## మూలాపేట, నెల్లూరు



నెల్లూరు మూలాపేట నందు సుమారు 1930 నుండి 'ఉపకుర్వాణ బ్రహ్మచారి మఠము'ను శ్రీ సత్యవ్రతానందస్వామి అను మహానుభావులు స్థాపించి, అచట వేదాభ్యాసము, జ్యోతిష్యము నేర్పించటం, ఉపనయనములు చేయించుట మొదలైన కార్యక్రమములు జరిపిస్తున్నారు. వారి తదనంతరము వారి శిష్యులు శ్రీ వావిలాల సుబ్రహ్మణ్యంగారు ఈ సంస్థను నడుపుతున్నారు. వారి తదనంతరము ఈ సంస్థకు కాలదోషము పట్టి ఏ కార్యక్రమమూ లేక ఉండిపోయింది. ఇక్కడ ప్రతిష్ఠింపబడిన శ్రీ ఆదిశంకరుల దేవాలయము కూడా పోషణ లేకుండా ఉంది.



ఈ తరుణములో ప్రముఖ న్యాయవాది కీ.శే. శ్రీ చింతా రామమూర్తిగారి ప్రోద్బలముతో 2008వ సంవత్సరములో ఈ మఠమును శ్రీ కంచి కామకోటి పీఠము పేరున రిజిస్టరు చేసి, పీఠమువారికి సర్వహక్కులతో స్వాధీనము చేశారు. అప్పటి నుండి శ్రీ కంచి కామకోటి పీఠమువారే ఈ మఠము సంరక్షణ భారము స్వీకరించారు.

తదుపరి ఇక్కడ శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర ఆలయం ఇతర పరివార దేవతలతో సహా నిర్మించటం జరిగింది. 2014లో శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి దివ్యహస్తములతో విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేకము నిర్వహించారు. ఆనాటి నుండి ఈ దేవాలయములో నిత్యపూజలు, అభిషేకములు నిర్వహిస్తున్నారు.

2013లో శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు కలియుగము నందు చండీ అమ్మవారిని, గణపతిని ప్రార్థించడం ద్వారా అతి శీఘ్రముగా ఫలితములు





లభిస్తాయని, ఈ విధముగా ఎక్కువమంది భక్తులకు అనుగ్రహము కలగాలని తక్కువ రుసుముతో బ్రాహ్మణ ముఖతః జరిపించమని ఆదేశించారు. వారి అదేశానుసారము నెల్లూరు శంకరమఠములో ప్రతి మాసము పౌర్ణమినాడు 'చండీయాగము' నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 121 చండీయాగములు పూర్తయినవి. వీటివలన సత్ఫలితములు పొందిన భక్తులు ఎందరో ఉన్నారు.

ఇటీవల సంభవించిన కరోనా మహమ్మారి వలన ఆరోగ్యం దెబ్బతిన్న భక్తజనుల అభ్యర్థన మేరకు ప్రతి మూడు మాసములకు ఒకసారి మహామృత్యుంజయ పాసుపత హోమం అమావాస్య నాడు నిర్వహిస్తున్నారు. ఇది కూడా విశేష ఆదరణ పొందినది.

2015, 2016లలో వచ్చిన గోదావరి, కృష్ణా పుష్కరములకు వేంచేసినప్పుడు, కృష్ణా పుష్కరముల నుండి తిరిగి వెళుతున్నప్పుడు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు, శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు పీఠముతో సహా శంకరమఠము నందు విడిది చేశారు.

2020లో శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు పీఠముతో సహా 3-2-2020 నుండి 18-2-2020 వరకు నెల్లూరు శంకరమఠము నందు విడిది చేసి, నెల్లూరు పరిసర ప్రాంతములలో వివిధ దేవాలయములలో కుంభాభిషేక కార్యక్రమములు నిర్వహించి, నెల్లూరు ప్రజలను అనుగ్రహించారు.

నెల్లూరు సమీపములోని జిల్లా అంతటికీ తలమానికమైన 'జొన్నవాడ కామాక్షి' ఆలయమునకు, కంచి కామకోటి పీఠమునకు అనాదిగా అనుబంధం ఉంది. ఈ దేవాలయ సమీపంలో కంచి కామకోటి పీఠమువారు నిర్మించిన 'యాత్రినివాస్' ఉంది.

**హరహర శంకర జయజయ శంకర**





శ్రీ ఎ. కుప్పుస్వామిగారు ఆంగ్లంలో రచించిన 'SHANKARACHARYA and His connection with kanchipuram' అనే ఎనిమిది అధ్యాయాల పుస్తకం నుండి తెలుగు అనువాదం క్రిందటి సంచిక తరవాతి భాగం...

# కాంచీపురంతో శ్రీశంకరాచార్యుల అనుబంధం

### దక్షిణ మోక్షపురి కంచి

వాడుకలో ఉన్న, ప్రాచుర్యం పొందిన శ్లోకం (జనన, మరణ బంధాల నుంచి విముక్తిని కలిగించే నగరాలు) ఏడు మోక్షపురులను పేర్కొంటుంది.

**శ్లో॥ అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ అవంతికా ।**
**పురీ ద్వారవతీ చైవ సప్తైతే మోక్ష దాయకాః ॥**

(అయోధ్య, మధుర, మాయా లేదా హరిద్వార్, కాశీ, కంచి, అవంతిక లేక ఉజ్జయిని, ద్వారకా అన్న ఏడు నగరాలు మోక్షాన్ని ప్రసాదిస్తాయి).

ఈ ఏడింటిలో, హరిద్వార్, కాశీ, ఉజ్జయిని అన్నవి శివుడి భక్తులకు పవిత్రమైనవి కాగా, అయోధ్య, మధుర, ద్వారకా అన్నవి విష్ణు భక్తులకు పావనమైనవి. అయితే, దక్షిణ మోక్షపురి కంచి, మాత్రం శివుడు, విష్ణువు, శక్తి ఉపాసకులందరికీ కూడా ఒకేరకంగా పవిత్రమైంది. కాంచీపురంగా ప్రాచుర్యం పొందినది కంచి. తమిళ సంగమ యుగానికి చెందిన ప్రాచీన రచన పెరుంపనర్రుపద్దై, కంచిని ప్రపంచంలోని ప్రాచీన నగరంగా పేర్కొంది.

**மலர்தலை உலகத்துல்லும் பலர் தொழ**
**விழவு மெம்பட்ட பழவிறன் மூதூர்**

తమిళంలో ఉన్న ఈ రెండు పంక్తులు (తమిళంలో), ప్రపంచంలోనే అతిపురాతన నగరంగా కంచిని అభివర్ణించడమే కాదు, అన్ని మతాలకు చెందిన భక్తులు ఇక్కడ జరుపుకున్న పండుగల కారణంగా దీని కీర్తి ఇనుమడించింది అని పేర్కొంటున్నాయి.

కాంచీమహత్యంలో కంచిని భూమికి నాభికేంద్రంగా పేర్కొన్నారు:-

**శ్లో॥ ఆధిభౌతికమంహోఘ్నమ్ నాభిస్థానం భువః పరమ్ (Chapter 31-70)**

కామాక్షీ విలాసం కూడా తన 11, 13వ అధ్యాయాలలో కంచిన భూమికి నాభికేంద్రంగా పేర్కొంది - (అధ్యాయం 11-6-13-73).

**శ్లో॥ ఆధి భౌతిక మర్మాంగం నాభిస్థానం భువః పరం, (Chapter 11- 6)**
**జగత్మామకాలాకారం నాభిస్థానం భువః పరం. (Chapter 13-73)**

భౌగోళికంగా చెప్పుకున్నప్పుడు కాంచీ, తూర్పు గోళార్థం దాదాపు మధ్యలో ఉన్నట్టు భావించవచ్చు.

నగర అక్షాంశం దాదాపు 12.5 ఉత్తరాన ఉంది. మానవ శరీరంలో నాభి అనేది మానవ దేహ మధ్య భాగానికి కొద్దిగా ఎగువన ఉంటుందన్న విషయం గమనార్హం. మేరుతంత్ర కూడా కంచిని భూగర్భ నాభిగా అభివర్ణిస్తోంది. అజిముత్తల్ ప్రపంచ పటం కూడా కంచిని భూమి నాభికేంద్రంలో ఉన్నట్టు సూచిస్తుంది.

శివుని ఆకాశక్షేత్రంగా (ఆకాశానికి సంబంధించిన పవిత్ర స్థలం) చిదంబరం ప్రసిద్ధి చెందింది. అయినప్పటికీ, కంచి అన్నది దేవికి చెందిన బిలాకాశం. కామాక్షీ విలాసం ఏమంటుందంటే :

**శ్లో॥ తపః స్థానం బిలం సూక్ష్మం వ్యోమ తత్స్మృతం.**

కంచిలోని శ్రీ కామాక్షీ ఆలయంలో దేవి తపస్సు చేసుకుని గర్భగుడిలోని సూక్ష్మ బిలం ద్వారా అత్యున్నతమైన వాయుమండలం అనగా బిలాకాశంలో ఉన్నది అని ఈ శ్లోకం అర్థం. తాంత్రిక గ్రంథమైన 'సౌభాగ్య చింతామణి' కూడా కాంచీపురమును శక్తికి చెందిన ఆకాశ పీఠంగా పేర్కొంటుంది.

శివజ్ఞాన మునివర్ రచన అయిన కంచిపురాణం కూడా కంచిని భూమాత నాభి కేంద్రంగాను, సర్వవ్యాప్త వాతావరణంగానూ క్రింది పేర్కొన్న శ్లోకంలో పేర్కొంటోంది :

**அணையால் பரப்பு நூணன் பிலமாகி அருட்பர வெளியாய்த் திகழும்.**
**அணைகடல் உடுக்கை நிலமகட்குந்தி ஸ்தானமாம்**
**(காஞ்சிபுராணம், வீராட்டஹாஸபடலம் - 31)**

**(కంచిపురం వీరత్తహాసప్పటలం)**

పురాణాలలో కంచిని పవిత్ర పుణ్యక్షేత్రంగా అభివర్ణించారు. ఉమాసంహితలో ఏడు మోక్షపురుల వంటి పవిత్ర స్థలాలకు వ్యాస మహర్షి తీర్థయాత్ర గురించి పదకొండు శ్లోకాలలో వర్ణించారు. అందులో ఒక శ్లోకం ఈ విధంగా పేర్కొంటుంది.

**శ్లో॥ కాంచీమ్ చ త్ర్యంబకం చాపి సప్త గోదావరీతటం,**

**కాలంజరం ప్రభాసం చ తథా బదరికాశ్రమం. (v-44-47)**

పైన పేర్కొన్న శ్లోకం వ్యాసుడు గోదావరి డెల్టాను సందర్శించినట్టు పేర్కొంటుంది. 'సప్తగోదావరి తట' అన్న పేరు గల ప్రాంతంలో గోదావరి నది ఏడు పవిత్ర పాయలు సముద్రంలో సంగమిస్తాయి. ఈ నేపథ్యంలో, వ్యాసులవారి సప్తగోదావరి ప్రాంత, కాంచి పర్యటన వృత్తాంతం చాలా ఆసక్తి కలిగిస్తుంది.

వ్యాసుడు వారణాసిలో నివసిస్తున్న సమయంలో కొందరు ఋషులు ఆయన వద్దకు వచ్చి, "మోక్షాన్ని సాధించేందుకు ఏ దేవుడిని పూజించాలి?" అని ప్రశ్నించాడు. వ్యాసుడు రెండు చేతులను పైకెత్తి, అందరికన్నా గొప్ప భగవంతుడు నారాయణుడు" అన్నారట. ఆ దగ్గరలోనే ఉన్న 'నందీశ్వరుడు' ఆగ్రహించి, వ్యాసుడిని, "నువ్వు ఎత్తిన చేతులు ఎప్పటికీ అలాగే ఉండుగాక" అంటూ శపించారుట. చేతులను కిందకు దింపలేకపోయిన వ్యాసుడు, ఉపశమనం కోసం విష్ణువును ప్రార్థించాడు. విష్ణువు ఆయన ఎదుట ప్రత్యక్షమై, 'శివుడే పరదైవము. నువ్వు ఆ విషయాన్ని మర్చిపోకుండా ఉండవలసింది. శివుడిని ప్రార్థించి, ఆరాధిస్తూ, తీర్థయాత్రలలో కొంత సమయాన్ని గడుపు' అన్నారు. విష్ణువు సూచించినట్టుగానే వ్యాసుల వారు వారణాసి నుంచి దక్షిణాది వరకూ సుదీర్ఘ తీర్థయాత్ర చేశారు. కాలక్రమంలో ఆయన గోదావరి డెల్టాను చేరుకున్నారు. గోదావరి నది పాయలలో ఒకటి సముద్రంలో సంగమించే పవిత్ర ప్రాంతమైన 'బ్రహ్మసంవేద్యం'లో స్నానమాచరించారు. అక్కడ ఆయనకు నందీశ్వరుని శాపం కారుణంగా తాను ఇంకా అనుభవిస్తున్న బాధల నుంచి విముక్తి పొందేందుకు సంకేతం లభించిందిట.

కాలక్రమంలో వ్యాసులవారు చేతులు దించలేని స్థితిలోనే కంచి చేరుకున్నారు. కంచిలో శివుని స్తుతించిన తర్వాత నందీశ్వరుని శాపం నుంచి వ్యాసునికి విముక్తి లభించిందని అనేకమంది విశ్వసిస్తారు. ఈ ఆలయ విమాన పీఠం మీద ఉన్న కుడ్యాలలో ఒకదానిలో రెండు చేతులు ఒకదానిపై ఒకటి పెట్టుకుని తలపైకి పెట్టుకుని ఉన్న వ్యాసుని విగ్రహం కనిపిస్తుంది. దానిపక్కనే (ఎడమవైపున) నందీశ్వరుని శాపం నుంచి విముక్తమైన తర్వాత సహజంగా రెండు చేతులూ కిందకే ఉన్న వ్యాసులవారి చిత్రం కనిపిస్తుంది. తపస్సు చేసేందుకు మునులు ఆశ్రయం తీసుకున్న ప్రదేశాల జాబితాను ఇస్తున్నప్పుడు, మార్కండేయ పురాణం కంచిలో నివసిస్తున్న ఋషుల గురించి ప్రస్తావిస్తుంది.

**శ్లో॥ దక్షిణాః కౌరుషా యే చ రిషికాః తాపసాశ్రమాః ।**

**ఋషభా: సింహలాః చైవ తథా కాంచీ నివాసినః ॥**

కంచి, దక్షిణ పవిత్ర నదీ ప్రవాహం (భారతదేశంలోని ఏడు పవిత్ర నదులలో) అయిన కావేరీ, అత్యంత పవిత్రమైన విష్ణు ఆలయం అయిన శ్రీరంగంతో ఒక శ్లోకంలో అనుసంధానిస్తుంది. తెలుగు, ఇతర దక్షిణాది పరిశోధనలలో శ్లోకం ఈ విధంగా కనిపిస్తుంది.

**శ్లో॥ కామకోటిపురీం కాంచీమ్ కావేరీమ్ చ సరిద్వరామ్,**

**శ్రీ రంగాఖ్యం మహాపుణ్యం యత్ర సన్నిహితో హరి: (sk.X.ch.71-4)**

సుక్షమ ఆగమం, కరణ ఆగమం వంటి ఆగమ గ్రంథాలలో 'కామకోష్ట' అన్న పదాన్ని శివుని ఆలయాలలో దేవి ఉండే స్థానాన్ని సూచించేందుకు వాడతారు. మనసార (పాతాళ 65 – శ్లోకం –1) అన్న శిల్పశాస్త్ర గ్రంథంలో దేవి ఆలయ నిర్మాణ ప్రణాళికకు సంబంధించి వాడిన పదాలలో ఇది కనిపిస్తుంది. కామకోష్టం అన్న పేరు, కామకోటి పురి అనేది కేవలం కాంచిపురి అని తేలికగా అర్థం చేసుకోవడానికి వీలుగా కంచి అధి దేవత అయిన కామక్షి నివసించే కంచి నగరంలో మధ్యనున్న ప్రాంతాన్ని సూచిస్తుంది.

భారతదేశంలోని శక్తి పీఠాలలో కంచిని ముఖ్యమైన పీఠంగా శక్తి తంత్రాలు గుర్తిస్తాయి. దేవికి చెందిన 108 పీఠాలలో మూడింటిని ప్రధానమైన పీఠాలుగా మహలక్ష్మి – తంత్ర పేర్కొంటుంది. అవి –కంచిలోని కామరాజ పీఠం, కామరూపంలోని పీఠం, జలంధరలో ఉన్న పీఠం. శబ్దార్థ సర్వస్వము అయిన బెంగాలీ విశ్వకోశం, కంచిని పురాతనమైన, గొప్ప పుణ్యక్షేత్రంగా, మహోన్నతమైన పీఠాన్ని కలిగి ఉన్నదానిగా అభివర్ణిస్తుంది.

## काञ्चीपुर एक प्राचीन महातीर्थ है... काञ्ची महापीठस्थान है।

కంచిలో శివుడు, విష్ణువు, గణేశుడు, తదితర దేవతలకు చెందిన అనేక పవిత్ర ఆలయాలను భక్తులు పవిత్రంగా భావిస్తారు. కొన్ని భారీ ఆలయాలు కాగా మరికొన్ని చిన్నవి. కొన్ని ఆలయాలు అసాధారణమైన నిర్మాణ, శిల్ప సౌందర్యంతో విరాజిల్లుతుంటాయి. శివుడికి అంకితం చేసిన ఆలయాలలో, శ్రీ ఏకామ్రనాథ ఆలయం అత్యంత ముఖ్యమైంది. విష్ణు కంచికి సమీపంలోని శ్రీ కైలాసనాథుని, శ్రీ కచ్ఛపేశ్వరుని ఆలయాలు, శివస్థానంలో గల చిన్న ఆలయాలు ముఖ్యమైనవి. వైష్ణవ ఆలయాలలో శ్రీ వరద రాజ, శ్రీ వైకుంఠ పెరుమాళ్, ఉలగలంద పెరుమాళ్ ఆలయాలు ప్రముఖమైనవి. కామాక్షి ఆలయ గర్భగృహం కుడివైపున సముచిత స్థానంలో ఉంచి ఆది వరాహ మూర్తి స్థావరం భారతదేశంలోని 108 పవిత్ర విష్ణు క్షేత్రాలలో ఒకటి.

కంచిలో అనేక ఆలయాలకు దాదాపు మధ్యలో ఉన్న శ్రీ కామాక్షి ఆలయం, దేశంలోని అత్యంత ప్రాచీన ఆలయాలలో ఒకటి. ఐదు గొప్ప తమిళ కావ్యాలలో ఒకటైన శిలప్పదికారంపై ప్రాచుర్యం పొందిన వ్యాఖ్యానంలో ప్రాచీన కాలానికి చెందిన అదియార్కునల్లార్ పాత తమిళ గీతంలో ఈ ఆలయాన్ని, ముఖ్యంగా శ్రీకామాక్షి యొక్క కామకొట్టపు క్షేత్రపాలక దేవి అయిన శాస్త గురించి ప్రస్తావించారు. ఈ శ్లోకంలో దేవి తన చేతులకు గాజులను ధరించి ఉన్నట్టు అభివర్ణించారు. ఈ శ్లోకం కామకొట్ట క్షేత్ర పాలక దేవత అయిన శాస్త ఆశీర్వచనంతో, రక్షణతో కరికాల చోళుడు సాధించిన విజయాలను కూడా ప్రస్తావిస్తుంది. ఆ శ్లోకం ఇలా చెప్తుంది :-

"கச்சி வளைக்கைச்சி காமகொட்டங் காவல்
மெச்சி யினித்திருக்கும் மெய்ச்சாத்தன் கைக்கொண்டு
கம்பக் களிற்று கரிகாற் பெறுவளத்தான்
செம்பொற் கிரிதிருத்தசெண்டு"

అదనంగా, లలితా అష్టోత్తర శతనామావాళి, లలితా త్రిశతి, లలితా సహస్రనామంలో వరుసగా, 'కామకోటి – మహాపీఠ మధ్యస్థ', 'కామకోటి – నిలయ', కామకోటిక అన్న నామాలు, గుణవిశేషణాలు కనిపిస్తాయి. కంచి నగరం అన్నది 'కామకోటిపురి'.

సునిశిత దృష్టి గల యాత్రికుల దృష్టిని ఆకర్షించే ముఖ్య అంశం ఏమిటంటే – కంచిలోని ముఖ్యమైన ఆలయ గోపురాలు, అవి దగ్గరవి అయినా, దూరంగా ఉన్నా, అన్నీ కూడా కామాక్షి ఆలయ ముఖంగా ఉంటాయి. అంతేకాకుండా, నగరంలోని అన్ని ఆలయాల ఉత్సవమూర్తుల ఊరేగింపులన్నీ కూడా శ్రీ కామాక్షి ఆలయం చుట్టూ ఉన్న నాలుగు రాజవీధులు (ప్రధాన వీధులు) గుండా ఊరేగింపు చేస్తారు.

వీటన్నింటికీ మించి, ఒక్క శ్రీకామాక్షి ఆలయంలో మినహా కంచి నగర పరిధిలో ఉన్న ఏ శివాలయంలోనూ దేవి కోసం గర్భ గుడి లేదా దేవి మూలవిగ్రహంగా రాతితో చేసిన మూర్తి కానీ కనిపించకపోవడం విశేషం. కానీ, నగర పొలిమేర్లు దాటుతూనే, అంటే కంచికి సమీపంలోనూ, దూరంలోనూ ఉన్న అన్ని శివాలయాలలోనూ ప్రత్యేకంగా దేవి కోసం కేటాయించిన గర్భగృహంలో దేవి మూలవిగ్రహాలు కనిపిస్తాయి. ఈ దృగ్విషయానికి కారణాన్ని 'కామాక్షీ –విలాసం'లోని కొన్ని శ్లోకాలలో వివరించడం జరిగింది.

**సంబంధిత శ్లోకాలు**

**శ్లో॥ తతస్తత్ కామదేవస్య తపసా తుష్టమానసా,**
**కదాచిత్ తత్ర కామాక్షీ మహాత్రిపురసుందరీ. (11)**

**శ్లో॥ ప్రసన్నాథ మహాశక్తి: స్వకటాక్ష నిరీక్షణాత్,**

దదౌ కామాయ దివ్యాస్త్రం నృణామ్ ఆనంద దాయకం (12)

శ్లో॥ తదా సర్వేషు శైవేషు కైలాసాద్యాలయేషు చ,
యత్ర యత్ర స్థితాః సర్వా గౌరీ: స్వాంశతయా స్థితాః. (31)

శ్లో॥ సమాకృష్యైక్యతో దేవీ తూష్ణీమాసీత్ శుభాననా. (32)

శ్లో॥ ఇతి చింత్య తతో బ్రహ్మా కామాక్ష్యా: చిత్రమిత్యపి,
విజ్ఞాయ జ్ఞానదృష్ట్యా తు కామకోష్ఠ మహీతలే. (70)

శ్లో॥ కామాక్ష్యా: సన్నిధిం ప్రాప్య ధ్యాత్వారాధ్య మహేశ్వరీమ్ (71)

శ్లో॥ హృది ధ్యాత్వా తు కామాక్షీమ్ ద్వాదశాబ్దం తపో2కరోత్ (72)

శ్లో॥ తతః ప్రసన్నా సా దేవీ కామాక్షీ భక్తకామదా,
తత్ర బ్రహ్మాణమాలోక్య వచనం చేదం అబ్రవీత్. (73)

శ్లో॥ శివజిత్ క్షేత్రమిత్యుక్తం ఇదం క్షేత్రం వినా భువి,
సర్వాలయేషు శైవేషు సన్నిధత్తామ్ సదాంబికా (75)

కైలాసంతో సహా దేశంలోని శివాలయాలలోని దేవి మూర్తులలో నిక్షిప్తమైన శక్తులను తన ఆకాశ కుహరంలోకి ఆకర్షించింది. తర్వాత, కామాక్షి విలాసం ప్రకారం బ్రహ్మ దేవిని ప్రార్థించగా, కంచి నగరంలోని శివాలయాలలో మినహా, ఇతర శివాలయాలన్నీ దేవి ఆలయాలను కలిగి ఉంటాయని అధిదేవత కామాక్షి హామీ ఇచ్చిందిట. కనుక, కంచి 'శివజిత్ క్షేత్రం'గా ప్రాచుర్యం పొందింది.

ప్రాచీన సంస్కృత కావ్యాలలో పతంజలి మహాభాష్యంలో కంచికి సంబంధించిన తొలి ప్రస్తావన కనిపిస్తుంది. ఈ గ్రంథాన్ని పతంజలి క్రీ.పూ. రెండవ శతాబ్దంలో రచించారనని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత ఎంతో కాలానికి వచ్చిన శ్రీహర్షుడు, పంచ మహాకావ్యాలలో ఒకటైన 'నైషధ చరిత్ర'లో దమయంతి స్వయంవరంలో కంచి పాలకుడు కూడా ఉన్న విషయాన్ని ప్రస్తావించటమే కాక, కంచిలోని 'యోగేశ్వరమూర్తి'ని గురించి కూడా పేర్కొన్నాడు.

సంగమ యుగానికి చెందిన, మధ్య యుగానికి చెందిన అనేక తమిళ కావ్యాలులో కంచి ప్రస్తావన మనకు కనిపిస్తుంది. సంగమ యుగ కావ్యమైన 'పెరుపనర్రుపదై', కంచిని అపరిమితమైన విద్యా ప్రగతిని సాధించిన పురాతన నగరంగా (ఎఱఅవ శ్రీఱఅవం 408–41) పేర్కొంటుంది.

సంగమ యుగానంతర కాలానికి చెందిన తమిళ పంచకావ్యాలలో ఒకటైన 'మణిమేకలై', ప్రాచీన చోళ పాలకుల రాజధాని అయిన పుహార్ సముద్ర కోతకు గురై విధ్వంసం కావడం, తదనంతరం దాని నుంచి బయిటపడిన అనేకమంది పెద్ద సంఖ్యలో ఆ శిథిల నగరం నుంచి కంచికి వలస రావడం గురించి వివరిస్తుంది (20పర్వంలో).

కంచిలోని ఆలయాలలోని దేవతలను స్తుతించిన శైవ నయనార్లు, వైష్ణవ ఆళ్వార్లు, శ్రీ కామాక్షి మహిమను, మహత్తును ఈ విధంగా వర్ణించారు :–

கொழும்பவளச் செங்கனியாய்க் காமக் கோடித்
கொங்கயிணை யமர்பொருது கோலங்கொண்ட
தழும்புளவெ வரை மார்பில்... (6 - ஆம் திருமுறை. திருவதிகை
வீரட்டாணம் அடையாளத் திருத்தாண்டகம்-10)

తిరువదికుట్టి విరట్టానం (తమిళనాడులోని దక్షిణ ఆర్కాట్ జిల్లాలో పన్నురుట్టి)ను స్తుతిస్తున్నప్పుడు కూడా కామకోటి (అంటే కంచిలోని కామకొట్టానికి చెందిన కామాక్షి) ప్రస్తావనలు కనిపిస్తాయి.

అప్పార్ (క్రీ.శ. 7వ శతాబ్దం) సమకాలీనుడైన తిరుజ్ఞాన సంబందార్, ఇరుంబులై నాథుడు (తమిళనాడులోని తంజావూరు జిల్లాకు చెందిన అలంగుడి) స్తుతిస్తూ, కంచిలో ప్రకాశిస్తున్న కామకోటితో పాటు ప్రకాశిస్తున్న వానిగా ఆలంగుడి ఆలయంలోని

ఈశ్వరుడిని అభివర్ణించారు. ఈ శ్లోకంలోని రెండవ వాక్యం (కచ్చిప్పొలి కామక్కొడియడన్ కుడి) – ×× – తిరుమురై – ఇరుంబులై –4) అని పేర్కొంటుంది. మరొక తేవరం శ్లోకంలో కంచిని అత్యంత సుసంపన్నమైనదిగా, ఆకాశపు అంచులను తాకుతున్నదానిగా దిగువన పేర్కొన్న వాక్యాలలో సంబందార్ పేర్కొన్నారు:–

“விண்ணமர் நெடுமாடம் ஓங்கி விளங்கிய கச்சி”

ఏడవ తిరుమురైలోని ఒక తేవరం శ్లోకంలో ఒనకాంతనరలిని కొనియాడితూ, ప్రాచీన నగరమైన కామకొట్టం గురించి సుందరార్ ప్రస్తావించారు.

“கச்சி மூதூர் காமக்கொட்டம் உண்டக..”

నచ్చినర్కినియారా, చెక్కిషార్ సహా అనేకమంది గొప్ప తమిళ పండితులు కాంచీ నగరాన్నిచ దాని ప్రాముఖ్యతను తమ రచనలలో కొనియాడారు. చెక్కిర్ఘూర్ ఈ విధంగా పేర్కొంటారు:–

புண்ணியத் திருக்காமகோட்டத்துப் பொலிய முப்பதோடி ரண்டறம்
புரக்கும்(71 - திருக்குறிப்புத் தொண்டநாயனார் - பெரியபுராணம்)

తన శ్లోకాలు ఒకదానిలో కంచిని శ్లాఘిస్తూ, నగరంలోని రాతి ప్రాకారాలను గురించి తిరుమంగై ఆళ్వార్ ప్రస్తావించారు.

ఈ శ్లోకంలో ఉపయోగించిన తమిళపదాలు –(కల్లాల్ మదిల్ ష్వ కచ్చినగర్). ఇటీవలి కాలానికి చెందిన వేదాంత దేశిక, ఏడు మోక్షపురులలో ముఖ్యమైనదైన కంచిలో ప్రకాశిస్తున్న శ్రీ వరదరాజస్వామిని శరణాగతి వేడుకోవాలన్న విషయాన్ని తన రచనలో మాట్లాడతారు.

కంచిలోని శ్రీ వరదరాజస్వామిని తన ‘వరదరాజ స్తవం’ అన్న అందమైన భక్తి గీతంలో అప్పయ్య దీక్షితార్ కీర్తించారు.

చారిత్రిక దృక్పథం నుంచి కూడా కంచి నగరం ముఖ్యమైనది. మౌర్య సామ్రాజ్యానికి దక్షిణాన గల స్వతంత్ర రాజ్యాలలో సత్యవ్రత రాజ్యం గురించి అశోకుని శాసనాలు కొన్ని ప్రస్తావిస్తాయి. సునిశిత పరిశీలనతో తమిళదేశ కంఠ ప్రాంతం లేదా తొండైమండలం అన్నదే ప్రాచీన సత్యవ్రత రాజ్యం అని నిర్ధారించవచ్చు. కంచికి ‘సత్యవ్రతక్షేత్రం’ అన్న పేరు కూడా ఉన్న విషయాన్ని గుర్తించడం అవసరం. ఒక అబద్ధాన్ని చెప్పి ప్రపంచాన్నే కైవసం చేసుకునే అవసరం ఉన్నా తొండైమండలం ప్రజలు అసత్యాన్ని చెప్పరు అని ప్రముఖ తమిళ కవి పుహాళేంది ఒక శ్లోకంలో పేర్కొన్నారు.

(‘வையகம் பெறினும் பொய்யுரைக்க மாட்டார் தொண்டை நாட்டார்.’)

దక్షిణాదిపై తన దండయాత్రలలో చివరిగా గుప్త వంశపు చక్రవర్తి సముద్రగుప్తుడు కంచిని చేరుకున్నట్టు చరిత్ర చెప్తుంది. తదనంతర కాలంలో వచ్చిన పల్లవులు, చోళ వంశాలకు చెందిన రాజులకు, విజయనగర సామ్రాజ్య గవర్నర్లకు కంచి రాజధానిగా ఉంది. క్రైస్తవ శకపు తొలి శతాబ్దాలలో తన ఘటికలు లేదా విద్యా కేంద్రాలతో సాహితీ ప్రఖ్యాతికి కేంద్రంగా కంచి విరాజిల్లింది. 4వ శతాబ్దానికి చెందిన కదంబ రాజు మయూర వర్మ, ఉన్నత విద్య కోసం తన గురువు వీరసన్మాన్‌తో కలిసి కంచిలోని ఘటికకు వచ్చినట్టు తల్గొంతం రాగి ఫలకాలు పేర్కొంటాయి. ఇతర అంశాలతో పాటుగా నందివర్మన్ పల్లవ (క్రీ.శ. 826–849)కు చెందిన కాశకుడి ఫలకాలు ఒక దానిలో నాలుగు వేదాల అధ్యయనం కంచిలో ఉన్నట్టు స్పష్టం చేస్తోంది.

కంచి పాలకుడైన స్కంద శిష్య (క్రీ.శ.4వశతాబ్దం తొలి కాలంలో) సత్యసేన అన్న రాజు నుంచి ఘటికను (విద్యా కేంద్రం) స్వాధీనం చేసుకున్నాడు. (దక్షిణ భారత శాసనాలు - సంపుటి 2, భాగం -3, పేజీ 349) .

విక్రమాదిత్య సత్యాశ్రయ (క్రీ.శ. 533-545) కంచిలోని శ్రీకైలాసనాథుని ఆలయంలోని మహామండపంలోని ఒక స్తంభంపై వేయించిన శాసనంలో కంచిలోని ఘటిక (విద్యా కేంద్రం) గురించి ప్రస్తావిస్తారు (ఎపిగ్రాఫికల్ ఇండికా -సంపుటి 3, పేజీ 360). అరక్కోణం (ఉత్తర ఆర్కాట్ జిల్లా)కు సమీపంలోని వేలూర్‌పాలాయంలోని నరసింహవర్మ పల్లవ (ఎస్. ఇండ్. ఇన్‌స్క్రిప్షన్స్ సంపుటి 2, భాగం 5) వేయించిన మరొక శాసనం ఘటిక పునరుద్ధరణ గురించి, కంచిలో కైలాసనాథుని ఆలయ నిర్మాణం గురించి పేర్కొంటుంది. కంచిలోని ఘటిక దేశవ్యాప్తంగా ప్రాచుర్యం కలిగినదానిగా పేర్కొన్నారు.

భారవి వంటి గొప్ప పండితులు కంచిలో విలసిల్లారు. కంచిలోని తన ఆస్థానానికి భారవిని తీసుకురావడంలో పల్లవరాజు అయిన సింహవిష్ణు కీలక పాత్ర పోషించారు. కంచి నుంచి పాలించిన పండితుడు, రాజు అయిన మహేంద్రవర్మ పల్లవ 'మత్తవిలాస-ప్రహసన' అన్న చక్కటి సంస్కృత పదబంధాన్ని రచించాడు. ప్రసిద్ధ గ్రంథమైన 'కావ్యదర్శ'ను రచించిన అలంకారిక రచయిత దండిన్ క్రీ.శ. 684 నుంచి 705 వరకు కంచిని పాలించిన రాజసింహ పల్లవుడి ఆస్థానాన్ని అలంకరించాడు. సూర్యునిపై 'మయూరశతకం'ను రచయిత మయూర కవి అనేక సంవత్సరాలు కంచిలో గడిపినట్టు తెలుస్తోంది. కనుక, ఆలయాలు, మఠాలు, ప్రముఖ విద్యా, సాహితీ కేంద్రంగానేగాక, చారిత్రిక ప్రాముఖ్యతను కలిగి ఉండడంతో పాటుగా అనేక వంశాలకు చెందిన పాలకులకు, గొప్ప యోగులు, ఋషులు, పండితులకు కేంద్రంగా, నాయనార్లు, ఆళ్వార్లు, గొప్ప పండితులతో ముడిపడిన కామకోష్ఠం కేంద్రంగా, ముఖ్యమైన దక్షిణ మోక్షపురిగా, భూమికి నాభి కేంద్రంగా విశ్వసించడమే కాక, పరాశక్తి కామాక్షీ తల్లి జాలువారే కృపతో సత్యవ్రత క్షేత్రమైన కంచి విలసిల్లుతోంది.



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

శ్లో॥ అంకితశంకరదేహాం అంకురితోరోజకంకణాశ్లేషైః ।
అధికాంచి నిత్యతరుణీమద్రాక్షం కాంచిదద్భుతాం బాలామ్ ॥ 15 ॥


**తాత్పర్యం:-** కాంచీనగరమునందు స్తనకంకణాలింగనములచే చిహ్నితమైన శంకరదేహము కలిగిన ఒకానొక బాలను చూచితిని.

**బాలమనోజ్ఞా:-** ఇక్కడ శివా శివులయొక్క అభేధాన్ని, అమ్మవారి బాహ్యమైన కామరూపాన్ని వర్ణిస్తున్నారు. ఆ తల్లి స్వామిని కౌగలించుకొనినదట. ఆ ఆలింగనముచే కంకణముల ముద్రలు , ఆలింగనపు గుర్తులు శంకర దేహమునందు (సైకత లింగముయందు)ఉన్నవట. ఈ విధంగా శివశక్తి అభేదాన్ని ధ్యానిస్తూ నిత్యయవ్వన మూర్తి అయిన బాలను కాంచినగరము నందు చూశానని భావము. కంపానదీ తీరములో తనచేతులతో సైకతలింగము నిర్మించి ఆ లింగాన్ని అమ్మవారు హత్తుకున్నటువంటి దృశ్యాన్ని కవి అద్భుతంగా వర్ణించారు.

శ్లో॥ మధురధనుషా మహీధరజనుషా నందామి సురభిబాణజుషా ।
చిద్వపుషా కాంచిపురే కేలిజుషా బంధుజీవకాంతిముషా ॥ 16 ॥


**తాత్పర్యం:-** చెరుకు విల్లు, పూలబాణములు, బంధుజీవపుష్పము యొక్క కాంతినపహరించు జ్ఞానమనే శరీరమును కలిగి, కాంచీపురము నందు ఆడుకొను హిమవత్పుత్రిక ఆ కామాక్షి చేత ఆనందించుచున్నాను.

**బాలమనోజ్ఞా:–** మనోరూపేక్షుకోదండా పంచతన్మాత్రసాయకా” అని లలితామ్మవారి వర్ణనం. మనస్సనే చెరకువిల్లుని ధరించి శబ్దస్పర్శరూపరసగంధాలనే తన్మాత్రలను పంచబాణములను ధరించి ఉన్నదట ఆ తల్లి. మన్మథునిది కూడా చెరుకువిల్లే. అతని పంచబాణాలు అరవిదం, అశోకం, చూతం, నవమల్లికా, నీలోత్పలాలు. అవి సుగంధితములై జీవుల చిత్తాలను బాధిస్తాయి. కానీ ఈ తల్లి యొక్క సుగంధభరితములైన బాణాలు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. బంధుజీవపుష్పమనగా బంధూకకుసుమం. అనగా మంకెనపూవు. మంకెనపూవు యొక్క ఎర్రటి కాంతిని కూడా అపహరిస్తూ జ్ఞానమనే దేహంతో అమ్మవారు ప్రకాశిస్తూ ఉన్నదట. “బంధూకకుసుమప్రఖ్యా” అని లలితాసహస్రనామం. హిమాలయములయందు పుట్టిన పర్వతరాజపుత్రి మా భాగ్యము చేత కాంచీపురమునందు ఆటలాడుకొనుచున్నది. అటువంటి ఆ కామాక్షి ని చూసి ఆనందిస్తున్నాను.




'అమృతవాణి' – 2022–23లో స్వామివారు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో చేపట్టిన విజయయాత్ర సందర్భంగా తెలుగులో ఒసగిన దివ్య ప్రవచనాల సంకలనమే ఈ పుస్తకము. మన సంస్కృతి వారసత్వపు సంపదలు, సనాతన ధర్మం, హిందూ ఆలయాలు, యువతకు సందేశాలు, దేశభక్తి, దైవభక్తి, గురుభక్తి, మానవతా విలువలు – ఇలా స్వామివారి ప్రవచనాల అంశాలను ఎన్నిటినో ఈ పుస్తకంలో పొందుపరిచారు.మే 29న పూజ్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు 'అమృతవాణి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అమూల్యమైన ఈ పుస్తకము కావాలనుకునే వారు క్రింద ఇవ్వబడిన లింక్ ద్వారా తమ పూర్తి చిరునామాతో సంప్రదించగలరు. https://www.kanchimuttseva.org/AmrutaVani.php

# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక




వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



**Bank Details:**

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

**Subscription**

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id - srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM
JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
SHRIMATAM SAMSTHANAM
1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt


Koo

koo @kamakoti

www.kamakoti.tv

www.kanchimuttseva.org
ESEVA PORTAL
for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



గురుపుంగవ పుంగవకేతన తే సమతామయతాం న హి కోఽపి సుధీః।
శరణాగత వత్సల తత్త్వనిధే భవ శంకర దేశిక మే శరణమ్॥